Follow: @ANNTELUGU

25-06-2026

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 173 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఏఎన్ఎన్ మహా అవార్డ్స్ పోస్టర్

### ఆవిష్కరించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి

**అమరావతి, మహా :** ఏఎన్ఎన్ మహా ఆవార్డ్స్ హైదరాబాద్ వేడుక విజయవంతం కాగా, ఇపుడు అమరావతిలో అద్భుతమైన వేడుక నిర్వహించాలని నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య, వ్యాపార రంగాల్లో విశేష కృషి చేసిన వారిని గుర్తించి సత్కరించేందుకు అమరావతిలో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక 'ఏఎన్ఎన్ మహా అవార్డ్స్2026' (హెల్త్ అండ్ బిజినెస్ అవార్డ్స్) పోస్టర్‌ను రాష్ట్ర రవాణా, యువజన సర్వీసులు , ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఈవో కంది రామచంద్రారెడ్డిని, ఏఎన్ఎన్ టీమ్ ను అభినందించారు. ఏఎన్ఎన్ మీడియా గ్రూప్ విభాగానికి చెందిన ఏఎన్ఎన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఒక బృహత్తర వేదికగా నిర్వహించనున్నారు. 'సెలబ్రేటింగ్ ఎక్సలెన్స్ ఆనరింగ్ అచీవ్మెంట్' అనే నినాదంతో సమాజంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రముఖులకు ఈ మహా అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా హెల్త్ కేర్, బిజినెస్ రంగాల్లో విశేషమైన సేవలందిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడుతున్న వారిని ప్రత్యేకంగా గుర్తించి ప్రోత్సహించడమే లక్ష్యంగా ఏఎన్ఎన్ సంస్థ ఈ ముందడుగు వేసింది. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సీఈవో కంది రామచంద్రారెడ్డి, అసోసియేట్ ఎడిటర్ గడ్డం కృష్ణమూర్తి, అమరావతి బ్యూరో రాఘవ, అన్నమయ్య జిల్లా బ్యూరో మునయ్య, ఆపరేషన్స్ హెడ్ ఉప్పల శ్రీనివాస్ పాల్గొన్నారు.

టాప్ న్యూస్

## బాబాయ్.. అబ్బాయ్

- పవన్ కల్యాణ్‌ను కలిసిన రామ్‌చరణ్
- జనసేన కేంద్ర కార్యాలయంలో భేటీ



02

## నీరవ్ మోదీకి లండన్ కోర్టు షాక్..

బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ. 108 కోట్లు చెల్లించాలని ఆదేశం



02

## సినీ పరిశ్రమ కొత్తవారికి సురక్షితం కాదు

సింగర్ సునీత సంచలన వ్యాఖ్యలు.



03



## చేపల విక్రయాల్లో ఇక పారదర్శకత..

- ఆన్‌లైన్ బుకింగ్ విధానం అమలు.
- స్మార్ట్ ట్రేడర్ల అక్రమాలకు చెక్..
- మత్స్యకారులకు లాభదాయకంగా సరికొత్త వ్యవస్థ.

02



## అన్నకు తగ్గ తమ్ముడు..

- ఆశీర్వాద్ సూర్యవంశీ మరో భారీ సెంచరీ.

02

### సర్‌పై అలసత్వం వహిస్తే

# వేటు తప్పదు



### ఎమ్మెల్యేలపై నిప్పులు చెరిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**వారం రోజుల్లో తీరు మారకపోతే కొత్త ఇన్‌ఛార్జిల నియామకం**

- పనిచేయకపోతే మంత్రులనైనా మార్చేస్తామని తీవ్ర హెచ్చరిక. లౌకికవాదుల ఓట్లకు గండికొట్టే కుట్రలు జరుగుతున్నాయి
- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్.
- ఓటు హక్కు మనిషికి ఆక్సిజన్ లాంటిదన్న ఏఐసీసీ నేత మీనాక్షి నటరాజన్

**హైదరాబాద్,మహా :** ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ఏమాత్రం సీరియస్‌గా తీసుకోని సొంత పార్టీ ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నిసార్లు దిశానిర్దేశం చేసినా క్షేత్రస్థాయిలో మార్పు రాకపోవడం పట్ల ఆయన మండిపడ్డారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'సర్' ప్రక్రియపై నాయకులకు గట్టి

మిగతా 2వ పేజీలో

# సాయికృష్ణది లాకప్ డెత్తే!



- ఆధారాలు మాయం చేసి, మృతదేహాన్ని ధ్వంసం చేశారు.
- కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్ట్‌లో 'సిట్' సంచలన నిజాలు.
- హైకోర్టును తప్పుదోవ పట్టించి.. బాధితురాలిని దూషించిన సీఐ నాగరాజు.
- డీవీఆర్ డేటా డిలీట్.. ఎస్ఐ వాంగ్మూలంతో బట్టబయలైన ఘోరం

03

## ఉద్యోగులు, పెన్షనర్లకు భారీ జీవిత బీమా!

- రూ.1.20 కోట్ల వరకు ఉచిత రక్షణ..
- రేపు ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి.
- రవీంద్రభారతిలో ఘనంగా ఏర్పాట్లు..
- పలు బ్యాంకులతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు
- సహజ, ప్రమాద మరణాలకు వర్తింపు.. ఉద్యోగ వర్గాల్లో హర్షా తిరేకాలు.




02

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట

- నాటి కోవిడ్ ఉల్లంఘన కేసు కొట్టివేత.
- రాజకీయ దురుద్దేశంతోనే కేసు నమోదు.
- రేవంత్ రెడ్డి తరపు న్యాయవాది వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం.

02



## తుంగభద్ర జలాల్లో మన వాటా దక్కాలి..

కేంద్రం వెంటనే జోక్యం చేసుకోవాలి!
ఆర్డీఎస్ ఆయకట్టుకు అన్యాయం జరగనివ్వం.
నీటి పారుదల శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టీకరణ.

02






# చేపల విక్రయాల్లో ఇక పారదర్శకత..

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ మత్స్య విక్రయాల్లో పారదర్శకతను పెంచే దిశగా అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. మత్స్యకారులందరికీ సమాన అవకాశాలు కల్పించడం, దళారుల అక్రమాలను అరికట్టడమే ప్రధాన లక్ష్యంగా చేపల విక్రయాల కోసం నూతనంగా ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు ఫిషరీస్ ఫెడరేషన్ బుకింగ్ సేవలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా డిజిటలైజ్ చేయడంతో.. ఇకపై విక్రయాల ప్రక్రియ మరింత సులభంగా, పారదర్శకంగా సాగనుంది. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో స్పాట్ ట్రేడర్లు చేస్తున్న అక్రమాలకు, ఇష్టారాజ్యంగా సాగుతున్న వ్యాపారాలకు ఈ కొత్త విధానం ద్వారా గట్టి అడ్డుకట్ట పడనుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఈ నూతన డిజిటల్ వ్యవస్థలో భాగంగా 'సిమ్స్' ద్వారా చేపల బుకింగ్ సేవలను అధికారులు పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ఈ సాంకేతికత ద్వారా మత్స్యకారులు, వ్యాపారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అత్యంత సులభంగా ఆన్‌లైన్‌లో తమ విక్రయాలను బుకింగ్ చేసుకునే అవకాశం లభించింది. ఫెడరేషన్ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. 2026 జూన్ నెలలో ఆన్‌లైన్ ద్వారా రికార్డు స్థాయిలో మొత్తం 25.36 లక్షల చేపల విక్రయాలు నమోదయ్యాయి. వీటిలో సాధారణ ఆన్‌లైన్ బుకింగ్‌ల ద్వారా 14.63 లక్షల చేపలు విక్రయించగా, బుకింగ్ లేకుండా జరిగిన విక్రయాలు 10.73 లక్షలుగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

ఆన్‌లైన్ బుకింగ్ విధానానికి క్షేత్రస్థాయిలో విశేష స్పందన లభిస్తోంది. కేవలం జూన్ 21న ఒక్కరోజే 1.55 లక్షల చేపల ఆన్‌లైన్ విక్రయాలు జరగ్గా.. మరుసటి రోజు జూన్ 22న ఏకంగా 1.56 లక్షల చేపల విక్రయాలతో మరో సరికొత్త రికార్డు నమోదైంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కొత్త ఆన్‌లైన్ విధానం ద్వారా మత్స్య వ్యాపారంలో పారదర్శకత, జవాబుదారీతనం గణనీయంగా పెరగడంతో పాటు.. ప్రతి ఒక్క మత్స్యకారుడికి మార్కెట్‌లో న్యాయమైన, సమానమైన అవకాశాలు లభిస్తాయని సంబంధిత ఫిషరీస్ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నీరవ్ మోదీకి లండన్ కోర్టు షాక్..

**బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ. 108 కోట్లు చెల్లించాలని ఆదేశం.**

**లండన్,మహా:** బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగవేసి విదేశాలకు పారిపోయిన ఆర్థిక నేరగాడు నీరవ్ మోదీకి లండన్ న్యాయస్థానంలో భారీ ఎదురుదెబ్బ తగిలింది. బ్యాంక్ ఆఫ్ ఇండియాకు (బీవోఐ) బకాయిపడ్డ 11.5 మిలియన్ డాలర్లను (భారత కరెన్సీలో సుమారు రూ. 108 కోట్లు) చెల్లించాల్సిందిగా లండన్ సర్క్యూట్ కమర్షియల్ కోర్టు ఆయనను ఆదేశించింది. 2018 నుంచి నడుస్తున్న ఈ సుదీర్ఘ న్యాయపోరాటంలో చివరకు బ్యాంక్ ఆఫ్ ఇండియాకు అనుకూలంగా తీర్పు వెలువడింది.దుబాయ్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే 'ఫైర్‌స్టార్ డైమండ్ ఎఫ్‌జెడ్‌ఈ' అనే సంస్థకు నీరవ్ మోదీ అసోసియేట్‌గా వ్యవహరించారు. ఈ క్రమంలో సదరు కంపెనీ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి భారీగా రుణం తీసుకోగా.. దానికి నీరవ్ మోదీ తన వ్యక్తిగత పూచీకత్తు (గ్యారెంటీ) ఇచ్చారు. అయితే, ఆ తర్వాత ఫైర్‌స్టార్ డైమండ్ సంస్థ తీవ్ర నష్టాల్లో కూరుకుపోయి పూర్తిగా దివాలా తీసింది. నిబంధనల ప్రకారం సంస్థ తీసుకున్న అప్పు తీర్చాల్సిన బాధ్యత పూచీకత్తు ఇచ్చిన నీరవ్ మోదీపై పడింది. కానీ, ఆయన ఆ రుణాన్ని బ్యాంకుకు తిరిగి చెల్లించకుండా ఎగ్గొట్టి భారత్ నుంచి లండన్‌కు పారిపోయారు.ఈ మొండిబాకీని వసూలు చేసుకునేందుకు బ్యాంక్ ఆఫ్ ఇండియా 2018లో లండన్ కోర్టును ఆశ్రయించింది. అప్పటినుంచి ఈ కేసుకు సంబంధించి కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ వ్యవహారాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన లండన్ సర్క్యూట్ కమర్షియల్ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సైమన్ టింక్లర్ తాజాగా తుది తీర్పును వెలువరించారు. 2026 మార్చి నాటికి వడ్డీతో కలుపుకుని మొత్తం 11.5 మిలియన్ డాలర్లను బ్యాంక్ ఆఫ్ ఇండియాకు నీరవ్ మోదీ చెల్లించాల్సిందేనని ఆయన తమ తీర్పులో స్పష్టం చేశారు.ఇదిలా ఉండగా.. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న నీరవ్ మోదీ ప్రస్తుతం బ్రిటన్‌లోని ఓ జైలులో ఉన్నారు. ఈ భారీ కుంభకోణంపై సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సంస్థలు ముమ్మరంగా దర్యాప్తు కొనసాగిస్తున్నాయి. ఆయనపై భారత్‌లో పలు ఆర్థిక నేరాల కేసులు నమోదు కావడంతో, ఆయనను విచారణ నిమిత్తం దేశానికి రప్పించేందుకు భారత దర్యాప్తు సంస్థలు అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నాయి.

# ఉద్యోగులు, పెన్షనర్లకు భారీ జీవిత బీమా!




**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రేవంత్ రెడ్డి సర్కారు సరికొత్త తీపి కబురు అందించింది. ప్రభుత్వ ఉద్యోగ నిపుణులు, విశ్రాంత ఉద్యోగుల కుటుంబాల భవిష్యత్తుకు పూర్తి ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఒక ప్రత్యేక ఉచిత జీవిత బీమా పథకాన్ని రూపొందించింది. ఈ అద్భుతమైన సంక్షేమ పథకాన్ని శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రారంభించనున్నారు. రాజధాని హైదరాబాద్‌లోని ప్రముఖ సాంస్కృతిక కేంద్రమైన రవీంద్రభారతిలో ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోంది.

**అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.1.20 కోట్ల భారీ బీమా ధీమా**

రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులో ఉన్న అర్హులైన ఉద్యోగులతో పాటు రిటైరైన పెన్షనర్లందరికీ ఈ పథకం వర్తింపజేయనున్నారు. దీని కింద గరిష్ఠంగా ఏకంగా ఒక కోటి ఇరవై లక్షల రూపాయల (1.20 కోట్ల) వరకు ఉచిత జీవిత బీమా రక్షణ లభించనుండటం విశేషం. ఉద్యోగి లేదా పెన్షనర్ దురదృష్టవశాత్తూ సహజ మరణం పొందినా.. లేదా ఏదైనా రోడ్డు, ఇతర ప్రమాదాల బారిన పడి ప్రమాద వశాత్తూ మరణించినా (యాక్సిడెంటల్ డెత్) వారి కుటుంబాలు రోడ్డున పడకుండా, తక్షణ ఆర్థిక సహాయం అందేలా ప్రభుత్వం ఈ బీమా ప్రయోజనాలను క్రమబద్ధీకరించింది.

**ప్రముఖ బ్యాంకులతో ఒప్పందాలు.. అధికారుల కసరత్తు**

ఈ భారీ బీమా పథకాన్ని క్షేత్రస్థాయిలో ఎలాంటి అడ్డంకులు లేకుండా, అత్యంత పారదర్శకంగా అమలు చేసేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు ప్రముఖ జాతీయ, ప్రైవేటు బ్యాంకులతో ప్రత్యేక ఆర్థిక ఒప్పందాలు కుదుర్చుకుంది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల జీతాలు, పెన్షన్ ఖాతాల ఆధారంగా ఈ ప్రక్రియ సాగనుంది. తమ ప్రాణాలను పణంగా పెట్టి, ప్రభుత్వ పాలనలో కీలక భాగస్వాములుగా వ్యవహరిస్తున్న ఉద్యోగ వర్గాల కుటుంబాలకు ఒక పటిష్టమైన సామాజిక, ఆర్థిక రక్షణ వలయాన్ని ఏర్పాటు చేయడమే ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశమని సచివాలయ ఉన్నతాధికారులు వెల్లడించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘాలు, పెన్షనర్ల అసోసియేషన్లు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

# బాబాయ్.. అబ్బాయ్

- పవన్ కల్యాణ్‌ను కలిసిన రామ్‌చరణ్.
- జనసేన కేంద్ర కార్యాలయంలో భేటీ.

**మంగళగిరి,మహా. :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌తో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సమావేశమయ్యారు. బుధవారం సాయంత్రం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయానికి విచ్చేసిన రామ్ చరణ్.. బాబాయ్ పవన్ కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలోని ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరగనున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు ఆయన మంగళగిరి విచ్చేశారు. ఈ పర్యటనలో భాగంగానే జనసేన ప్రధాన కార్యాలయానికి వెళ్లి పవన్‌తో ఆత్మీయంగా ముచ్చటించారు.ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించడం, అందులో జనసేన పార్టీ వంద శాతం స్ట్రైక్ రేట్‌తో అద్భుత ఫలితాలు రాబట్టడం పట్ల పవన్ కల్యాణ్‌కు రామ్ చరణ్ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా, పలు కీలక శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం పవన్‌ను ఆయన తొలిసారిగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యువసేనాని రాకతో జనసేన కేంద్ర కార్యాలయంలో సందడి నెలకొంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం సాక్షిగా బాబాయ్, అబ్బాయ్ ఒకే ఫ్రేమ్‌లో ఉన్న ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.



# 'సర్'పై అలసత్వం వహిస్తే
# వేటు తప్పదు



( మొదటి పేజీ తరువాయి )

క్లాస్ తీసుకున్నారు. ఓటరు జాబితా సవరణ పేరుతో బీజేపీ క్షేత్రస్థాయిలో భారీ కుట్రలకు తెరలేపుతోందని, ఈ విషయంలో నాయకులు అప్రమత్తంగా వ్యవహరించకపోతే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని సీఎం హెచ్చరించారు. ప్రతి ఎమ్మెల్యే తమ నియోజకవర్గంలోనే మకాం వేసి, ఈ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అవసరమైతే తనకు ఒక నియోజకవర్గం అప్పగించినా వెళ్లి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**మంత్రులపైనా వేటుకు వెనుకాడం**

పార్టీ నేతల పనితీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేలు వెంటనే తమ తీరు మార్చుకోవాలని, వారం రోజుల్లోగా పనితీరులో మార్పు కనిపించకపోతే ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే ఎమ్మెల్యేల స్థానంలో, నియోజకవర్గంలో చురుకుగా పనిచేసే మరో నాయకుడికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగిస్తామని సంచలన ప్రకటన చేశారు. పార్టీ కోసం పనిచేయని నాయకులతో పార్టీకి ఎలాంటి అవసరం లేదని కుండబద్దలు కొట్టారు. పార్టీలో ఎంతటి ఉన్నత పదవిలో ఉన్నప్పటికీ 'సర్' విషయంలో క్షేత్రస్థాయికి వెళ్లి పని చేయాల్సిందేనని స్పష్టం చేశారు. "ఎవరెవరు ఎలా పనిచేస్తున్నారు.. ఎవరెవరు క్షేత్రస్థాయికి వెళ్లడం లేదో నా దగ్గర పక్కా రిపోర్ట్ ఉంది. పద్ధతి మార్చుకోకపోతే వచ్చే సమావేశంలో అందరి ముందు పేర్లు చదివి వినిపించాల్సి వస్తుంది. దయచేసి పేర్లు చెప్పించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దు" అని ముఖ్యమంత్రి తీవ్రంగా హెచ్చరించారు. ఈ ప్రక్రియలో ఇన్‌ఛార్జి మంత్రులు సైతం పూర్తి బాధ్యత తీసుకోవాలని, వారు కూడా పని చేయకపోతే వారిని మార్చేయడానికి కూడా వెనుకాడబోనని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**ఎమ్మెల్యేల తీరు మారాలి: పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**

ఈ జూమ్ సమావేశంలో పాల్గొన్న పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సైతం ఎమ్మెల్యేల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'సర్' ప్రక్రియలో అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పలువురు ఎమ్మెల్యేలకు ఆయన తీవ్ర స్థాయిలో వార్నింగ్ ఇచ్చారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకుని, ప్రతి ఓటునూ కాపాడుకోవాల్సిన బాధ్యతను భుజాన వేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో లౌకికవాదుల ఓట్లను పక్కా ప్రణాళికతో తొలగించేందుకు భారీ కుట్ర జరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గద్వాల, మల్కాజిగిరి, భువనగిరి, నిజామాబాద్ నియోజకవర్గాల్లో పార్టీ యంత్రాంగం చాలా వీక్‌గా ఉందని, అక్కడ తక్షణమే అప్రమత్తం కావాలని ఆదేశించారు. అత్యంత కీలకమైన ఈ కార్యక్రమాలకు మెజారిటీ ఎమ్మెల్యేలు దూరంగా ఉండటం ఏమాత్రం సబబు కాదని మహేష్ కుమార్ గౌడ్ హితవు పలికారు.

**ఓటు అనేది సోషల్ స్టేటస్: మీనాక్షి నటరాజన్**

ఓటు హక్కు కేవలం రాజకీయ నాయకుల కోసం మాత్రమే కాదని, అది ప్రజాస్వామ్య మనుగడకు అత్యంత కీలకమని ఏఐసీసీ నేత మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారు. మనిషి ప్రాణాలతో జీవించడానికి ఆక్సిజన్ ఎంత అవసరమో.. ఒక పౌరుడికి ఓటు హక్కు కూడా అంతే అవసరమని ఆమె విశ్లేషించారు. ఓటు అనేది ప్రతి మనిషికి ఒక సామాజిక హోదా (సోషల్ స్టేటస్) కల్పిస్తుందని చెప్పుకొచ్చారు. ఎన్నో ఏళ్లుగా అనేక పోరాటాలు, కష్టాలు పడితే కానీ ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఈ ఓటు హక్కు దక్కలేదని ఆమె గుర్తుచేశారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క నాయకుడిపైనా ఉందని మీనాక్షి నటరాజన్ ఈ సందర్భంగా వెల్లడించారు.

# తుంగభద్ర జలాల్లో మన వాటా దక్కాలి..

**హైదరాబాద్, మహా :** రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావాల్సిన తుంగభద్ర నికర జలాల వినియోగంలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించడానికి, భాగస్వామ్య రాష్ట్రాలతో సత్వరమే సమన్వయం సాధించడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం సాయంత్రం జలసౌధలో తుంగభద్ర ప్రాజెక్టు, రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్), అలాగే అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాలపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణకు దక్కుతున్న నీటి వాటాపై సీఎం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

**అన్యాయం అవుతున్న ఆయకట్టు**

తుంగభద్ర డ్యామ్ మరియు నదీ ప్రవాహం ద్వారా తెలంగాణ రాష్ట్రానికి చట్టబద్ధంగా 15.9 టీఎంసీల నీరు హక్కుగా రావాల్సి ఉందని, కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు గమనిస్తే కేవలం ఐదారు టీఎంసీలకు మించి నీరు రావడం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్డీఎస్ కింద జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలోని దాదాపు 75 గ్రామాల్లో ఉన్న 83,987 ఎకరాల ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందాల్సి ఉన్నప్పటికీ, సరైన నీటి ప్రవాహం లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక అనే మూడు రాష్ట్రాల భాగస్వామ్యం ఉన్నందున, అంతర్రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కేంద్రమే చొరవ చూపాలని స్పష్టం చేశారు. నీటి వాటాల సమర్థ వినియోగానికి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సారథ్యంలో పనిచేస్తున్న తుంగభద్ర బోర్డును మరింత పటిష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**ఆర్డీఎస్ ఆధునికీకరణపై కదలిక ఏదీ?**

మరోవైపు, ఆర్డీఎస్ ఆనకట్ట పరిస్థితి ప్రస్తుతం అత్యంత ప్రమాదకరంగా మారిందని ముఖ్యమంత్రి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. భద్రత దృష్ట్యా తక్షణం చేపట్టాల్సిన పనులను అత్యవసరంగా గుర్తించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రాజోలిబండ డైవర్షన్ కెనాల్ ఆధునికీకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే రూ. 59 కోట్లు డిపాజిట్ చేసినప్పటికీ పనులు ఎందుకు నత్తనడకన సాగుతున్నాయని అధికారులను ప్రశ్నించారు. ప్యాకేజీ 3, 4 పనులు మాత్రమే పూర్తయ్యాయని, ప్యాకేజీ 1, 2 పనులు ఇంకా ప్రారంభమే కాలేదని అధికారులు సీఎంకు వివరించారు. రేపు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి ఆధ్వర్యంలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో జరగనున్న కీలక సమావేశంలో ఈ నిలిచిపోయిన మొదటి రెండు ప్యాకేజీల పనుల విషయాన్ని ప్రధానంగా ప్రస్తావించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు.

**ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించండి**

తుంగభద్ర ఎత్తిపోతల పథకంలో భాగంగా సాధ్యమైనంత మేర నీటిని గరిష్ఠంగా వినియోగించుకునేందుకు ఉన్న అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా, తుమ్మిళ్ల నుంచి నీటిని సమర్థవంతంగా వాడుకునేందుకు అత్యంత కీలకమైన మల్లమ్మకుంట బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఇందుకు సంబంధించిన పనులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా అత్యంత వేగంగా చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, ఇరిగేషన్ సెక్రటరీ శ్రీధర్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ సహా ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## పూడికతీతపై కర్ణాటక సహకారం తప్పనిసరి

ఆర్డీఎస్ వద్ద తెలంగాణ భూభాగం వైపు భారీగా పూడిక పేరుకుపోవడం వల్ల ఆశించిన స్థాయిలో నీటి మళ్లింపు సాధ్యం కావడం లేదని ఇంజనీరింగ్ అధికారులు ఈ సమావేశంలో సీఎం దృష్టికి తీసుకొచ్చారు. 2004లోనే నిపుణుల కమిటీ ఈ పూడికను తొలగించాలని స్పష్టమైన సూచనలు చేసినా, నేటికీ ఆ సిఫార్సులు అమలుకు నోచుకోకపోవడంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చ జరిగింది. వెంటనే పూడికతీత పనులు చేపట్టేలా కేంద్రాన్ని అభ్యర్థించాలని, పూడిక ఉన్న భూభాగం కర్ణాటక పరిధిలో ఉన్నందున ఆ రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని కూడా కోరాలని ప్రభుత్వం నిర్ణయించింది. పూడికతీతతో పాటు 2004 నాటి కమిటీ సిఫార్సులు, అప్పటి నివేదికకు అనుగుణంగా ప్రస్తుత వాస్తవ పరిస్థితులను విశ్లేషిస్తూ కేంద్రానికి సమగ్రమైన వినతిపత్రాన్ని అందజేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలతో తక్షణమే నివేదికను తయారు చేయాలని ఇరిగేషన్ అధికారులకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- మన్నె గోవర్ధన్ రెడ్డి.
- వారం రోజుల్లో ఇంద్రానగర్ రోడ్డు పనులు పూర్తి చేయాలి.
- అధికారులతో మాట్లాడిన బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్.

**ఖైరతాబాద్,మహా:** ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని జూబ్లీహిల్స్ డివిజన్ ఇంద్రానగర్‌లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి (ఎంజీఆర్) విస్తృత పర్యటన చేపట్టారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'సమస్యలపై సమరం' కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం ఉదయం స్థానిక బస్తీల్లో పర్యటించి ప్రజల సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు పెద్ద ఎత్తున ఆయనను కలిసి తమ ఆవేదనను పంచుకున్నారు. గత ఎనిమిది నెలలుగా తమ ప్రాంతంలో రోడ్డు పనులు అసంపూర్తిగా వదిలేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, జీహెచ్ఎంసీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కనీస స్పందన కరువైందని వారు ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించిన గోవర్ధన్ రెడ్డి.. అక్కడి నుంచే జీహెచ్ఎంసీ ఎస్ఈ విజయ్ కుమార్, ఏఈ వెంకటేష్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. రోడ్డు సమస్య తీవ్రతను వివరించి, ప్రజల ఇబ్బందులను వెంటనే తొలగించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన అధికారులు, వారం రోజుల్లోగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను పూర్తి చేస్తామని ఆయనకు హామీ ఇచ్చారు. అనంతరం ఇంద్రానగర్ ప్రాంతంలో తీవ్రంగా ఉన్న తాగునీటి సమస్యపై కూడా ఆయన దృష్టి సారించారు. జలమండలి మేనేజర్ రాంబాబుతో ఫోన్‌లో మాట్లాడి, నీటి సరఫరాలో కనీస సమయపాలన పాటించకపోవడం వల్ల స్థానికులు పడుతున్న అవస్థలను వివరించారు. నీటి సరఫరా వ్యవస్థను గాడిలో పెట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను మన్నె గోవర్ధన్ రెడ్డి గట్టిగా కోరారు.



# అన్నకు తగ్గ తమ్ముడు..

**ఆశీర్వాద్ సూర్యవంశీ మరో భారీ సెంచరీ**

**హైదరాబాద్, మహా :** టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ టీ20 అరంగేట్రానికి సిద్ధమవుతున్న వేళ, అతడి తమ్ముడు ఆశీర్వాద్ సూర్యవంశీ దేశవాళీ స్థానిక క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తున్నాడు. ప్రస్తుతం భారత జట్టుతో కలిసి ఐర్లాండ్ పర్యటనలో ఉన్న వైభవ్.. త్వరలోనే తన తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడనున్నట్లు సమాచారం. ఈ తరుణంలో పదేళ్ల వయసున్న అతడి తమ్ముడు ఆశీర్వాద్ మరో అద్భుతమైన సెంచరీ సాధించి 'వైభవ్ సూర్యవంశీ 2.0'గా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు.

బిహార్‌లోని సమస్తిపూర్‌లో జరిగిన ఓ స్థానిక ప్రాక్టీస్ మ్యాచ్‌లో రిషవ్ ఎలెవన్ జట్టు తరఫున ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఆశీర్వాద్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. వైశాలి ఎలెవన్ జట్టుతో జరిగిన ఈ మ్యాచ్‌లో 119 బంతుల్లోనే 19 ఫోర్లు, ఆరు సిక్సర్ల సాయంతో ఏకంగా 168 పరుగులు సాధించాడు. అతడి భారీ ఇన్నింగ్స్ కారణంగా రిషవ్ ఎలెవన్ జట్టు ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్‌కు సంబంధించిన స్కోరు కార్డును తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్న వైభవ్.. తమ్ముడి అద్భుత ప్రదర్శన పట్ల తీవ్ర ఆనందం వ్యక్తం చేస్తూ మురిసిపోయాడు.

ఆశీర్వాద్ ఇలా భారీ స్కోరు చేయడం ఇదే తొలిసారి కాదు. ఇటీవలే తేజ్‌పూర్ క్రికెట్ అకాడమీ తరఫున ఆడిన ఓ మ్యాచ్‌లో కేవలం 87 బంతుల్లోనే 103 పరుగులు చేసి సత్తా చాటాడు. అతి తక్కువ వ్యవధిలోనే మరో సెంచరీ సాధించి ఆశీర్వాద్ అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాడు. సూర్యవంశీ కుటుంబంలో వైభవ్‌కు అన్న ఉజ్వల్, తమ్ముడు ఆశీర్వాద్ ఉన్నారు. కాగా, పన్నెండేళ్లకే రంజీల్లోకి, పద్నాలుగేళ్లకే రాజస్థాన్ రాయల్స్ తరఫున ఐపీఎల్‌లోకి అడుగుపెట్టిన వైభవ్ సూర్యవంశీ అరుదైన రికార్డులు సృష్టించిన విషయం తెలిసిందే. 2025 ఐపీఎల్‌లో రాయల్స్ ఓపెనర్‌గా బరిలోకి దిగి 35 బంతుల్లోనే సెంచరీ సాధించిన ఈ లెఫ్టాండర్ బ్యాటర్.. 2026 సీజన్‌లో సంచలన ప్రదర్శన కనబరిచి ఆరెంజ్ క్యాప్‌ను సైతం సొంతం చేసుకున్నాడు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట.

**హైదరాబాద్, మహా :**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టులో భారీ ఊరట లభించింది. గతంలో ఆయనపై నమోదైన ఒక క్రిమినల్ కేసును పూర్తిగా కొట్టివేస్తూ హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 2021వ సంవత్సరంలో జరిగిన హుజూరాబాద్ నియోజకవర్గ ఉపఎన్నికల ప్రచార సమయానికి సంబంధించిన కేసులో న్యాయస్థానం ఈ మేరకు తీర్పునిచ్చింది.

ఉపఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తరపున అప్పటి ఎంపీ, పీసీసీ అధ్యక్షుడు హోదాలో రేవంత్ రెడ్డి కమలాపూర్‌లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అయితే, ఆ సమయంలో అమల్లో ఉన్న కోవిడ్ 19 నిబంధనలను ఉల్లంఘించారని, నిబంధనలకు విరుద్ధంగా అనుమతించిన దానికంటే ఎక్కువ మంది జనాన్ని సమీకరించి సభలు, సమావేశాలు నిర్వహించారనే ఆరోపణలు ఆయనపై వచ్చాయి. ఈ ఆరోపణల ఆధారంగా స్థానిక కమలాపూర్ పోలీసులు అప్పట్లో రేవంత్ రెడ్డిపై ఐపీసీ సెక్షన్ 188 కింద కేసు నమోదు చేశారు .ఈ కేసు వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో సుదీర్ఘంగా విచారణ సాగింది. విచారణ సందర్భంగా రేవంత్ రెడ్డి తరపు న్యాయవాది కోర్టులో బలమైన వాదనలు వినిపించారు. నాటి ఎన్నికల ప్రచార సమయంలో తన క్లయింట్ కోవిడ్ నిబంధనలకు సంబంధించి అన్ని రకాల జాగ్రత్తలు పాటించారని కోర్టుకు వివరించారు. అప్పటి అధికార ప్రభుత్వం కేవలం రాజకీయంగా ఇబ్బందులకు గురిచేయాలనే దురుద్దేశంతోనే ఈ కేసును అక్రమంగా నమోదు చేయించిందని న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు



## జొన్నగిరిలో పసిడి తవ్వకాలకు శ్రీకారం

- అధికారికంగా ప్రారంభించిన ఏపీ సీఎం
- రాయలసీమ ముఖచిత్రం మారనుంది.
- యువత, మహిళలకు భారీగా ఉపాధి.
- ముఖ్యమంత్రి చంద్రబాబు.
- తొలి పసిడి స్థానిక వ్యాపారులకే.. జియోమైసూర్ సంస్థ కీలక ప్రకటన.

**కర్నూలు, మహా:** కర్నూలు జిల్లా జొన్నగిరిలో దేశంలోనే ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టిన ప్రతిష్టాత్మక బంగారు గనుల ప్రాజెక్టు అధికారికంగా ప్రారంభమైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం ఈ పసిడి తవ్వకాలను లాంఛనంగా ప్రారంభించారు. గత కొంతకాలంగా ఇక్కడ జరిగిన ప్రయోగాత్మక తవ్వకాలు విజయవంతం కావడంతో వాణిజ్యపరమైన ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు. ఈ గని నుంచి తొలివిడతగా వెలికితీసి శుద్ధి చేసిన బంగారాన్ని రాష్ట్రానికే చెందిన పలువురు ప్రముఖ జ్యుయలరీ సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి స్వయంగా అందజేశారు.రాష్ట్రంలో లభించే సహజ వనరుల ప్రయోజనాలు ముందుగా స్థానికులకే దక్కాలన్న ఉద్దేశంతో మైనింగ్ నిర్వహిస్తున్న 'జియోమైసూర్' సంస్థ ఈ సందర్భంగా కీలక నిర్ణయం తీసుకుంది. జొన్నగిరిలో ఉత్పత్తి అయ్యే బంగారాన్ని రాష్ట్రంలోని స్థానిక వ్యాపారులకే విక్రయించనున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో ఏపీ అంతర్గత మార్కెట్, ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు, స్వర్ణకారులకు నాణ్యమైన పసిడి నేరుగా అందుబాటులోకి రానుంది. ఈ మేరకు తొలి బంగారాన్ని వాసవీ జ్యూయలర్స్, సాయి సంతోష్ జ్యుయలర్స్, మధుమూర్తి జ్యుయలర్స్, ఎమరాల్డ్ జ్యుయలర్స్ సంస్థలకు సీఎం పంపిణీ చేశారు. గనుల తవ్వకాల్లో స్థానికులకు పెద్దపీట వేస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో భాగంగా సీఎం చంద్రబాబు..మైనింగ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక సిమ్యులేటర్ శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు. గనుల్లో మట్టిని, ఖనిజాన్ని తరలించే భారీ లారీలు, టిప్పర్లను నడపడంలో స్థానిక మహిళలు, యువతకు ఇస్తున్న డ్రైవింగ్ శిక్షణను అడిగి తెలుసుకున్నారు. మహిళలు సైతం ఉపాధి దిశగా ఈ భారీ వాహనాలు నడిపేలా శిక్షణ పొందడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఖనిజాన్ని తరలించే భారీ మైనింగ్ వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. జొన్నగిరి ప్రాజెక్టుతో రాయలసీమపై ఉన్న వెనుకబడిన ప్రాంతం అనే ముద్ర శాశ్వతంగా చెరిగిపోనుందని, దేశంలోనే రాష్ట్రం అతిపెద్ద పసిడి సరఫరాదారుగా సరికొత్త రికార్డు సృష్టించబోతోందని స్పష్టం చేశారు. పర్యావరణానికి ఎలాంటి ముప్పు లేకుండా పూర్తిగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ తవ్వకాలు జరుగుతున్నాయని తెలిపారు. వేలాది మంది యువత, మహిళలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ బంగారు గని ద్వారా ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీఎం భరోసా ఇచ్చారు. గురువారం నుంచి ఈ గనిలో పూర్తిస్థాయి వాణిజ్యపరమైన తవ్వకాలు ప్రారంభం కానున్నాయి.



## ఎల్‌పీఏఐ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్.

- సరిహద్దు ప్రాంతాల అభివృద్ధిలో ల్యాండ్ పోర్టుల పాత్ర కీలకం: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి.

**ఢిల్లీ, మహా**:దేశ సరిహద్దు ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, అంతర్జాతీయ వాణిజ్య విస్తరణ, పొరుగు దేశాల ప్రజల మధ్య సంబంధాల బలోపేతంలో ల్యాండ్ పోర్టులు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ కొనియాడారు. బుధవారం సాయంత్రం ఆయన న్యూఢిల్లీలోని లోక్ నాయక్ భవన్‌లో ఉన్న ల్యాండ్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎల్‌పీఏఐ) ప్రధాన కార్యాలయాన్ని మర్యాదపూర్వకంగా సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రికి ఎల్‌పీఏఐ ఛైర్మన్ జయంత్ సింగ్, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ బోర్డర్ మేనేజ్మెంట్ జాయింట్ సెక్రటరీ పసుమి బసు, ఎల్‌పీఏఐ సభ్యురాలు (ఫైనాన్స్) రేఖా రాయ్కర్ కుమారి ఘనంగా స్వాగతం పలికారు. సందర్శనలో భాగంగా ఎల్‌పీఏఐ ఛైర్మన్ జయంత్ సింగ్ సంస్థ యొక్క విధివిధానాలు, గత కొన్నేళ్లుగా సాధించిన విశేష పురోగతిని కేంద్ర మంత్రికి వివరించారు. అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి సమగ్ర చెక్‌పోస్టుల (ఐసీపీలు) అభివృద్ధి, వాటి సమర్థ నిర్వహణలో సంస్థ తీసుకుంటున్న బాధ్యతలను ఆయన తెలియజేశారు. సరిహద్దు వాణిజ్యం, ప్రయాణికులకు కల్పిస్తున్న అత్యాధునిక వసతులు, వివిధ దేశాల మధ్య అనుసంధానాన్ని మెరుగుపరచడంలో ఎల్‌పీఏఐ పోషిస్తున్న పాత్రను ఈ సందర్భంగా వివరించారు. అనంతరం బండి సంజయ్ కుమార్ ఎల్‌పీఏఐ ప్రధాన కార్యాలయంలో ప్రదర్శనకు ఉంచిన వివిధ సమగ్ర చెక్‌పోస్టుల నమూనాలను ఆసక్తిగా పరిశీలించారు. సంస్థ సరిహద్దుల వెంబడి చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌పీఏఐ ఛైర్మన్ కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ఆధునిక ల్యాండ్ పోర్టుల ఏర్పాటు వల్ల సరిహద్దు ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధి వేగవంతం కావడమే కాకుండా, అంతర్జాతీయ వాణిజ్యానికి, ప్రజల మధ్య సోదరభావాన్ని పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. దేశ భద్రతను కాపాడటంతో పాటు, ప్రాంతీయ అభివృద్ధి, వాణిజ్య రంగాల పురోగతికి ఎల్‌పీఏఐ అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని మంత్రి కొనియాడారు.



## సీఎం రేవంత్ రెడ్డితో మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా భేటీ

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో మేఘాలయ రాష్ట్ర ముఖ్యమంత్రి కాన్రాడ్ కె. సంగ్మా మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ ఆత్మీయ భేటీలో ఇరు రాష్ట్రాలకు చెందిన పలు అంశాలపై వారు చర్చించుకున్నట్లు సమాచారం. ఈ ప్రత్యేక సమావేశంలో మేఘాలయ సీఎం కాన్రాడ్ సంగ్మాతో పాటు ఆయన సతీమణి డాక్టర్ మెహతాబ్ చండీ ఎ. సంగ్మా కూడా పాల్గొని సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు.వీరితో పాటు మేఘాలయ రాష్ట్రానికి చెందిన ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు శ్రీ స్నియావ్ భలాంగ్ ధర్, శ్రీ ప్రెస్టోన్ టిన్సాంగ్ సైతం ఈ భేటీలో పాల్గొన్నారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని మరో రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి, తన సతీమణి ఇద్దరు ఉప ముఖ్యమంత్రులతో కలిసి ఏక కాలంలో మర్యాదపూర్వకంగా కలవడం రాజకీయ, అధికారిక వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

# సాయికృష్ణది లాకప్ డెత్తే!





**విజయవాడ, మహా:** రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులో చివరకు నగ్నసత్యం బట్టబయలైంది. సాయికృష్ణది ముమ్మాటికీ పోలీసుల అమానుషత్వానికి బలైన 'కస్టోడియల్ డెత్' (లాకప్ డెత్) అని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారికంగా నిర్ధారించింది. నిందితుడైన కృష్ణలంక సీఐ నాగరాజుకు ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు పూర్తి చేసిన అనంతరం పోలీసులు ఆయనను విజయవాడలోని రెండవ ఏజేఎస్ కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా సిట్ అధికారులు కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్ట్‌లో గుండెలు అవిసిపోయే దిగ్భ్రాంతికర నిజాలను పొందుపరిచారు. సాయికృష్ణను పోలీస్ కస్టడీలోనే అత్యంత దారుణంగా చంపి, ఆ తర్వాత సాక్ష్యాధారాలు దొరకకుండా మృతదేహాన్ని సైతం పూర్తిగా ధ్వంసం (డెస్ట్రాయ్) చేశారని రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ స్పష్టంగా పేర్కొంది. నాన్ బెయిలబుల్ వారెంట్ ఉన్నప్పటికీ నిందితుడిని కోర్టులో హాజరుపరచకుండా చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నారని విచారణలో తేలింది.

**మే 5 నుంచి 8 మధ్య పీఎస్‌లోనే ఉన్నాడు: ఎస్ఐ వాంగ్మూలం**

గత మే 5వ తేదీ నుంచి జూన్ 19వ తేదీల మధ్య కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘోరం జరిగిందని సిట్ వెల్లడించింది. సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన సిట్.. మొత్తం 17 మంది సాక్షులను విచారించి వివరాలు సేకరించింది. కేసులో కీలకమైన ఆధారాల కోసం కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించగా, అక్కడి కంప్యూటర్ సిస్టమ్‌లో డేటా ఏదీ లేకపోవడాన్ని గుర్తించారు. దీంతో స్టేషన్ సిబ్బంది హిమజతో పాటు పలువురిని విచారించగా అసలు విషయం వెలుగుచూసింది. మే 5వ తేదీ నుంచి మే 8వ తేదీల మధ్య సాయికృష్ణ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లోనే ఉన్నాడని, అతని మృతదేహాన్ని కూడా తాను పీఎస్‌లోనే చూశానని అక్కడి ఎస్ఐ ఇచ్చిన వాంగ్మూలం ఈ కేసులో అత్యంత కీలకమైన మలుపుగా మారింది.

**సాక్ష్యాల ధ్వంసం.. హైకోర్టుకే అబద్ధాలు!**

పోలీసు కస్టడీలో ఉండగా తీవ్రమైన గాయాలపాలై జూన్ 2వ తేదీ కంటే ముందే సాయికృష్ణ మరణించాడని సిట్ గట్టిగా విశ్వసిస్తోంది. ఈ దారుణాన్ని కప్పిపుచ్చుకోవడానికి, సాక్ష్యాలను నాశనం చేయడానికి సీఐ నాగరాజే ప్రధాన సూత్రధారి అని రిమాండ్ రిపోర్ట్‌లో తేల్చారు. మే 1 నుంచి జూన్ 1 వరకు ఉన్న ఒక నెల రోజుల సీసీటీవీ ఫుటేజ్ డేటా డీవీఆర్‌లో లేకుండా పూర్తిగా డిలీట్ చేశారని, ప్రస్తుతం ఆ డీవీఆర్‌లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించామని సిట్ పేర్కొంది. సాయికృష్ణ పోలీస్ కస్టడీలో మరణించినట్లు తెలిసినప్పటికీ.. కృష్ణలంక పోలీసులు ఆ సమాచారాన్ని నిబంధనల ప్రకారం మేజిస్ట్రేట్‌కు చేరవేయకుండా దాచేశారు. తన కుమారుడు ఏమయ్యాడో చెప్పాలంటూ సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి స్టేషన్‌కు వస్తే సీఐ నాగరాజు ఆమెను తీవ్రంగా దూషించి పంపించేశారు. ఆ తర్వాత ఆమె హైకోర్టులో 'హెబియస్ కార్పస్' పిటిషన్ వేసినా కూడా.. సీఐ నాగరాజు ఉన్నత న్యాయస్థానం ముందు సైతం వాస్తవాలను దాచి, కోర్టును ఘోరంగా తప్పుదోవ పట్టించారని సిట్ ఆధారాలతో సహా నిరూపించింది. శాస్త్రీయ ఆధారాలను చెరిపివేయడం ద్వారా సాయికృష్ణను హత్య చేశారని గుర్తించామని, ఈ అదృశ్యం, హత్య వెనుక ఉన్న మరిన్ని గూడుపుఠాణీలు బయటపడాలంటే నిందితుడైన సీఐ నాగరాజును తమ కస్టడీలోకి తీసుకుని మరింత లోతుగా విచారించాల్సి ఉందని సిట్ కోర్టుకు విన్నవించింది.

# సినీ పరిశ్రమ కొత్తవారికి సురక్షితం కాదు

**సింగర్ సునీత సంచలన వ్యాఖ్యలు.**



**హైదరాబాద్, మహా :** దశాబ్దాలుగా తన మధురమైన గాత్రంతో కోట్లాది మంది సంగీత అభిమానుల హృదయాలను గెలుచుకున్న ప్రముఖ టాలీవుడ్ సింగర్ సునీత సంచలన వ్యాఖ్యలు చేశారు. కేవలం పదిహేడేళ్ల చిరుప్రాయంలోనే ఇండస్ట్రీలో అడుగుపెట్టి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును ఏర్పరచుకున్న ఆమె.. తన సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూశారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న సునీత, సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న వేధింపులు, కాస్టింగ్ కౌచ్, అలాగే సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున జరుగుతున్న స్త్రీ సమానత్వం (ఫెమినిజం) వంటి సున్నితమైన అంశాలపై తనదైన శైలిలో స్పందించారు. సునీత చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు టాలీవుడ్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

సినీ పరిశ్రమలో మహిళలపై జరిగే వేధింపుల గురించి సునీత కుండబద్దలు కొట్టారు. ఇండస్ట్రీలో వేధింపులు జరుగుతున్నాయనేది అక్షరాలా నిజమని ఆమె స్పష్టం చేశారు. అయితే, ఇది ఇప్పటికే ఇండస్ట్రీలో ఒక గుర్తింపు తెచ్చుకున్న వారి కంటే కూడా.. కొత్తగా అవకాశాల కోసం వచ్చే అమాయకపు అమ్మాయిల విషయంలోనే చాలా ఎక్కువగా ఉంటుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తన వ్యక్తిగత జీవితంలో ఎదురైన చేదు అనుభవాలను సైతం సునీత గుర్తుచేసుకున్నారు. తనకు పద్దెనిమిదేళ్ల వయసులో ఉన్నప్పుడే ఇటువంటి చేదు అనుభవాలు ఎదురయ్యాయని, అయితే అవి తీవ్రమైన స్థాయిలో లేకపోవడం గమనార్హమని అన్నారు. ఇండస్ట్రీ అనేది కొత్తగా వచ్చే వాళ్లకు ఏమాత్రం సేఫ్ ప్లేస్ కాదని ఆమె తేల్చి చెప్పారు. ఇక్కడ సురక్షితంగా ఉండాలంటే మానసికంగా, ఎమోషనల్‌గా, శారీరకంగా, అలాగే ఆర్థికంగా కూడా చాలా బలంగా ఉండాలని, అప్పుడే ఈ రంగుల ప్రపంచంలో తట్టుకుని నిలబడగలరని సునీత స్పష్టం చేశారు.

ఇదే క్రమంలో ప్రస్తుత రోజుల్లో బట్టల ఎంపిక, వ్యక్తిగత స్వేచ్ఛ తదితర అంశాలపై నడుస్తున్న చర్చలపైనా సునీత ఘాటుగా స్పందించారు. చాలామంది 'నా బాడీ నా ఇష్టం.. నాకు నచ్చిన బట్టలు వేసుకుంటా' అని మాట్లాడుతున్నారని, దానిని ఫెమినిజం, సమానత్వంతో ముడిపెట్టడాన్ని ఆమె తప్పుబట్టారు. 'నీ బాడీ నీ ఇష్టం' అని ఒక మహిళ అంటే, దానికి బదులుగా 'నా కళ్లు నా ఇష్టం.. నేను చూస్తా' అని అవతలి వ్యక్తి అనొచ్చని ఆమె లాజిక్ తీశారు. ఎవరికి నచ్చిన బట్టలు వారు వేసుకోవచ్చని, అందులో అడ్డుకునే హక్కు ఎవరికీ లేదని చెబుతూనే.. ఆ వ్యక్తిగత కోరికను సమాజం మీద రుద్దడం, దానికి సమానత్వం అని పేరు పెట్టడం ఏమాత్రం కరెక్ట్ కాదని ఆమె హితవు పలికారు.

మహిళలు సిగరెట్ తాగడాన్ని కూడా సమానత్వంగా భావించడాన్ని సునీత తీవ్రంగా ఖండించారు. సిగరెట్ విషయంలో మగవాళ్లు, ఆడవాళ్లు అస్సలు సమానం కాదని స్పష్టం చేశారు. ఒక సిగరెట్ తాగితే మగవాడి కంటే ఆడవాళ్ల శరీరానికి జరిగే నష్టమే చాలా ఎక్కువగా ఉంటుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. సమానత్వం పేరుతో ఇలాంటి చెత్త విషయాలను చర్చించడం తనకు ఏమాత్రం నచ్చదని ఆమె తెగేసి చెప్పారు. మహిళలకు సమాజంలో ఇంకా చాలా పెద్ద సమస్యలు ఉన్నాయని, దయచేసి వాటి గురించి మాట్లాడాలని ఆమె పిలుపునిచ్చారు. దాపరికం లేకుండా సునీత చేసిన ఈ వాస్తవిక వ్యాఖ్యలపై ఇప్పుడు నెట్టింట సైతం సానుకూల స్పందన వ్యక్తమవుతోంది.

## ఇరాన్‌కు ఆర్థిక సాయం ఉండదు..

- ఆస్తుల విడుదలా లేదు: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.

**ఢిల్లీ, మహా.:** ఇరాన్‌కు ఆర్థిక సాయం అందించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌కు తాము ఎలాంటి నగదు ఇవ్వడం లేదని, అలాగే వారి ఆస్తులను కూడా విడుదల చేసే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. అయితే, ఒకవేళ పరిస్థితులు డిమాండ్ చేస్తే అత్యవసరంగా ఇరాన్‌కు ఆహారాన్ని మాత్రమే కొనుగోలు చేసి ఇస్తామని స్పష్టం చేశారు. మరోవైపు, హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకల విషయంలో సానుకూల పరిణామం చోటుచేసుకుందని, అక్కడ ఎలాంటి టోల్ ఛార్జీలు లేకుండా నౌకల సంచారానికి ఇరాన్ అంగీకరించిందని ట్రంప్ వెల్లడించారు.

మంగళవారం తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ది ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఈ మేరకు ఒక పోస్ట్ చేశారు. ఆంక్షల సడలింపుల ద్వారా అన్‌ఫ్రీజ్ చేయబడిన లేదా అమెరికా ట్రెజరీ ద్వారా విడుదల చేయబడే నిధులన్నీ వాషింగ్టన్ పూర్తి నియంత్రణలో ఉండే ఎస్క్రో ఖాతాలోకి వెళ్తాయని ఆయన అందులో వివరించారు. ఈ నిధులను ఇరాన్ కేవలం ఆహారం, అత్యవసర వైద్య సామాగ్రిని కొనుగోలు చేయడానికి మాత్రమే ఉపయోగించుకునే వీలుంటుందని స్పష్టం చేశారు. ఆ నిధుల వినియోగం మొత్తం అమెరికా పర్యవేక్షణలోనే ఉంటుందని ఆయన పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, టెహ్రాన్‌లో అణు తనిఖీలు జరగనున్నాయంటూ వస్తున్న వార్తలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఇరాన్‌లో అణు కేంద్రాలను పరీక్షిస్తామన్న అంతర్జాతీయ అణు శక్తి సంస్థ (ఐఏఈఏ) చీఫ్ గ్రోసీ ప్రకటనను ఇరాన్ దౌత్యవేత్తలు తోసిపుచ్చారు.

# అంగరంగ వైభవంగా 'మాటా' రెండో మహాసభలు.

- అమెరికాలో దేదీప్యమానంగా తెలుగు సంస్కృతి.
- ఫిలడెల్ఫియాలో 7,500 కుటుంబాలతో ప్రతిష్ఠాత్మక వేడుకలు.
- డీఎస్పీ, రామ్ మిర్యాల లైవ్ షోలతో ఉర్రూతలూగిన ప్రవాసులు.
- ప్రముఖ నటి జయప్రదకు 'మాటా' లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు.



**పెన్సిల్వేనియా**:మహా:ఉత్తర అమెరికాలో తెలుగు సంస్కృతి, సామాజిక ఐక్యత, సేవా కార్యక్రమాలకు ప్రతీకగా నిలుస్తున్న 'మన అమెరికన్ తెలుగు అసోసియేషన్' (MATA మాటా) రెండో మహాసభలు అత్యంత ఘనంగా ముగిశాయి. పెన్సిల్వేనియా రాష్ట్రంలోని గ్రేటర్ ఫిలడెల్ఫియా ఎక్స్‌పో సెంటర్, ఫెయిర్‌గ్రౌండ్స్ వేదికగా రెండు రోజుల పాటు అట్టహాసంగా జరిగిన ఈ వేడుకల్లో 7,500 మందికి పైగా తెలుగు కుటుంబాలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. ఉత్తర అమెరికాలో జరిగిన అతిపెద్ద తెలుగు సమ్మేళనాల్లో ఒకటిగా ఈ మహాసభలు చరిత్ర సృష్టించాయి. ఈ కార్యక్రమానికి పలువురు టాలీవుడ్ సినీ ప్రముఖులు హాజరై సందడి చేశారు.

**తారల తళుకులు.. సంగీత హోరు**

సినీ ప్రముఖుల రాకతో మాటా వేడుకలు మరింత ఆకర్షణీయంగా మారాయి. ప్రముఖ నటులు నిఖిల్ సిద్ధార్థ్, ఐశ్వర్య రాజేష్, జయప్రద, సుమన్, అలీతో పాటు హాలీవుడ్ నటుడు విషి అయ్యర్ తమదైన శైలిలో సందడి చేశారు. హాస్యనటులు శివారెడ్డి, అదిరే అభి, సునామి సుధాకర్, మిమిక్రీ రమేష్ తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ (DSP) తన లైవ్ కాన్సర్ట్‌తో ప్రవాసులను ఉర్రూతలూగించారు. ప్రపంచ స్థాయి ఆడియోవిజువల్ సాంకేతికత, అద్భుతమైన లైటింగ్‌తో జరిగిన డీఎస్పీ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే గాయకుడు రామ్ మిర్యాల లైవ్ మ్యూజికల్ షో సైతం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. తొలిరోజు వేడుకలకు యాంకర్ నిఖిల్ విజయేంద్ర సింహా హోస్ట్‌గా వ్యవహరించగా.. రెండో రోజు స్టార్ యాంకర్లు సుమ కనకాల, ప్రదీప్ మాచిరాజు తమదైన పంచ్‌లతో వేడుకల్లో మరింత ఉత్తేజం నింపారు.

**ప్రముఖులకు పురస్కారాల ప్రదానం**

ఈ మహాసభల వేదికపై ప్రముఖ నటి, మాజీ ఎంపీ జయప్రదకు అత్యున్నత 'మాటా లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు'ను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. డాక్టర్ ఎం.ఎస్. రెడ్డి, డాక్టర్ హరినాథ్ పోలిచర్లలకు 'ప్రైడ్ ఆఫ్ ఇండియా' అవార్డులను అందజేశారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి 'మాటా ఎక్సలెన్స్ అవార్డులు' వరించాయి. ఈ పురస్కారాలను టీ.పీ. శ్రీనివాస్ రావు (వ్యాపార రంగం), భాస్కర్ గంటి (దాతృత్వం), సాయినాథ్ కర్నాటి (యువ పారిశ్రామికవేత్త), స్వాతి అట్లూరి (కళలు, సంస్కృతి), దాము గేదల, కృష్ణ మద్దిపట్ల (కమ్యూనిటీ సర్వీస్), డాక్టర్ విజయ్ భాస్కర్ బొల్లం (మానవతా సేవ), నాగేశ్వరరావు పూజారి (చలనచిత్ర రంగం), రాజు చామర్తి (గ్లోబల్ తెలుగు హెరిటేజ్) తదితరులు అందుకున్నారు.

**మత సామరస్యం.. భక్తిపారవశ్యం**

తెలుగు, భారతీయ, అంతర్జాతీయ వంటకాలతో ఏర్పాటు చేసిన గ్రాండ్ బ్యాంక్వెట్ తో ఈ మహాసభలు ప్రారంభమయ్యాయి. ప్రధాన సభలు మత సామరస్యానికి ప్రతీకగా హిందూ పూజారి, ఇమామ్, క్రైస్తవ పాస్టర్ల సంయుక్త ప్రార్థనలతో మొదలుకావడం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం నిర్వహించిన శ్రీ సీతారామ శోభాయాత్ర, భద్రాచల సీతారామ కళ్యాణ మహోత్సవం, పట్టాభిషేక కార్యక్రమాలు హాజరైన వారిని భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటే లీడర్‌షిప్, బిజినెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), మహిళా సాధికారత, వైద్య, న్యాయ, రాజకీయ, సాహిత్య రంగాలపై నిర్వహించిన ప్రత్యేక సదస్సులు ఆలోచింపజేశాయి. 'మాటా సింగింగ్ స్టార్' పోటీల్లో 300 మందికి పైగా గాయకులు పాల్గొని తమ గాత్ర ప్రతిభను చాటారు.

**సమిష్టి కృషితో మహాసభలు సక్సెస్**

సేవ, సంస్కృతి, సమానత్వం అనే నినాదంతో జరిగిన ఈ మహాసభలు ప్రపంచ తెలుగు సమాజ ఐక్యతను చాటిచెప్పాయి. మాటా అధ్యక్షుడు రమణ కిరణ్ దుద్దాగి, కన్వీనర్ శ్రీధర్ గూడల నాయకత్వంలో, వ్యవస్థాపకులు, అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్ గణగోని, ప్రదీప్ సామల, అడ్వైజరీ కౌన్సిల్ సభ్యులు జితేందర్ రెడ్డి మార్గదర్శకత్వంలో ఈ వేడుకలు విజయవంతమయ్యాయి. ఈ మహాసభల సక్సెస్‌లో కోకన్వీనర్లు టోనీ జన్ను, దాము గేదల, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ గుడూరు, జనరల్ సెక్రటరీ విజయ్ భాస్కర్ కలాల్, కన్వెన్షన్ కోఆర్డినేటర్ కళ్యాణి బెల్లంకొండ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేశ్ చిలకపాటి, ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మహేందర్ నారాల, డైరెక్టర్లు శిరీష గుండపునేని, స్వాతి అట్లూరి, అడిషనల్ సెక్రటరీ శ్రీధర్ పెంట్యాల, ఇండియా కోఆర్డినేటర్ డా. విజయ భాస్కర్ బొల్లం, మీడియా డైరెక్టర్ ప్రశాంత్ శ్రీపెరంబుదూరు, స్పోర్ట్స్ డైరెక్టర్ సురేష్ ఖాజానా తదితరుల సేవలు ఎంతో కీలకమైనవని నిర్వాహకులు కొనియాడారు.

## ఇంగ్లాండ్‌లో వైభవ్‌కు డ్రెస్సింగ్ రూమ్ దూరం!

**హైదరాబాద్, మహా :** టీమిండియా యువ సంచలనం, పదిహేనేళ్ల వయసులోనే జాతీయ జట్టుకు ఎంపికైన వైభవ్ సూర్యవంశీకి ఇంగ్లాండ్ పర్యటనలో ఒక విచిత్రమైన పరిస్థితి ఎదురుకానుంది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌ల కోసం ఎంపికైన వైభవ్.. ఇప్పటికే జట్టుతో కలిసి పయనమయ్యాడు. చిన్న వయసు కావడంతో బీసీసీఐ ప్రత్యేక అనుమతితో అతడి వెంట తల్లిదండ్రులు కూడా ప్రయాణించారు. అయితే, జులై 1 నుంచి ప్రారంభమయ్యే ఇంగ్లాండ్ పర్యటనలో వైభవ్‌కు భారత జట్టు ప్రధాన డ్రెస్సింగ్ రూమ్‌ను వినియోగించుకునే అవకాశం లేకుండా పోతుందని క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ), ఐసీసీ నిర్దేశించిన కఠినమైన వయో నిబంధనలే ఇందుకు కారణమని తెలుస్తోంది.

ఐసీసీ భద్రతా నిబంధనల ప్రకారం 16 ఏళ్ల లోపు వయసున్న ఆటగాళ్లు పెద్దలు ఉండే డ్రెస్సింగ్ రూమ్‌లను వాడేందుకు అనుమతి లేదు. ఇది ఐసీసీ నిబంధనల పరిధిలో జరిగే ఈవెంట్ కావడంతో ఆ భద్రతా విధానాలు కచ్చితంగా అమల్లో ఉంటాయని, అందుకే సూర్యవంశీకి ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించనున్నామని ఇంగ్లాండ్ బోర్డు వర్గాలు స్పష్టం చేశాయి. మ్యాచ్ జరుగుతున్న సమయంలో మాత్రమే వైభవ్ భారత డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లేందుకు అనుమతి ఉంటుంది. కానీ, మ్యాచ్‌కు ముందు మరియు మ్యాచ్ ముగిసిన తర్వాత దుస్తులు మార్చుకోవడానికి (ఛేంజింగ్ కోసం) మాత్రం ప్రధాన డ్రెస్సింగ్ రూమ్‌ను ఉపయోగించడానికి అనుమతి ఉండదని అధికారులు తేల్చి చెప్పారు.

వైభవ్ కోసం కేటాయించే ప్రత్యేక గదితో పాటు అతని వెంట వచ్చిన తల్లిదండ్రులకు కూడా ప్రతి మ్యాచ్ వేదిక వద్ద తగిన వసతి సదుపాయాలు కల్పిస్తామని ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు ప్రతినిధులు వెల్లడించారు. అయితే, ఈ అసాధారణ పరిస్థితి దృష్ట్యా పదిహేనేళ్ల వైభవ్ ఏమాత్రం ఇబ్బంది పడకుండా ఉండేందుకు బీసీసీఐ అధికారులు త్వరలోనే ఇంగ్లాండ్ బోర్డు ప్రతినిధులతో ప్రత్యేకంగా చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు సమాచారం



తెలుగు
మహా పత్రిక
గురువారం, హైదరాబాద్
25-06-2026
Mahaa Special
WWW.MAHAADAILY.COM

## ఆదాయంలో

# తెలంగాణ అగ్రస్థానం



## కితాబిచ్చిన కాగ్

### అప్పులతో ఆందోళన

**ఆదాయానికి మించి వ్యయాలు చేస్తోందని వెల్లడి**
**పెరుగుతున్న అప్పులే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ముందున్న అసలు పరీక్ష**
**కాగ్ నివేదిక లో వెల్లడైన అంశాలివే**



దేశంలో అత్యధిక స్వంత ఆదాయాన్ని సమకూర్చుకుంటున్న రాష్ట్రాల్లో తెలంగాణ మరోసారి అగ్రస్థానంలో నిలిచింది. అయితే అదే సమయంలో పెరుగుతున్న అప్పులు, నగదు కొరత, రిజర్వ్ బ్యాంకు తాత్కాలిక రుణాలపై అధికంగా ఆధారపడటం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని సూచిస్తున్నాయని కంప్ట్రోటల్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తెలంగాణ ఆర్థిక పరిస్థితి (202425) పై విడుదల చేసిన నివేదికలో పేర్కొంది .తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో ఒకవైపు బలమైన ఆదాయ వనరులు ఉన్నప్పటికీ, మరోవైపు పెరుగుతున్న వ్యయభారం, అప్పులు, నగదు నిర్వహణ సమస్యలు కూడా ఉన్నాయని నివేదికలో స్పష్టం చేసింది.202425 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణకు మొత్తం రూ 1,67,804 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో రాష్ట్ర స్వంత పన్ను ఆదాయం (ఎస్ఓటీఆర్)రూ 1,09,233 కోట్లు కాగా పన్నేతర ఆదాయంరూ 23,608 కోట్లు, మొత్తం స్వంత ఆదాయంరూ 1,32,841 కోట్లు గా ఉంది.మొత్తం ఆదాయంలో వాటా79.16 శాతంగా నమోదైంది.రాష్ట్ర ఆదాయంలో దాదాపు 80 శాతాన్ని తెలంగాణ రాష్ట్రం స్వయంగా సమకూర్చుకుంటోంది. కేంద్రంపై ఆధారపడే ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇది అత్యంత బలమైన స్థితి అని కాగ్ తమ నివేదికలో స్పష్టం చేసింది.స్వంత పన్ను ఆదాయం విషయంలో దేశంలో తెలంగాణ నాలుగో స్థానంలో నిలిచింది.తెలంగాణ కన్నా హర్యానా,మహారాష్ట్ర,కర్ణాటక ముందున్నాయని తెలిపింది. 60 శాతం కంటే ఎక్కువ ఆదాయాన్ని స్వంత పన్నుల ద్వారానే సమకూర్చుకుంటున్న ఏడు రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఒక రాష్ట్రమని పేర్కొంది.

**తెలంగాణ కు ఆదాయం వనరు ఎక్కడిది!**
తెలంగాణకు జీఎస్టీ ద్వారానే అత్యధికంగా ఆదాయం వస్తోందని ఈ పద్దు ద్వారా రూ 42,443 కోట్ల ఆదాయం సమకూర్చుకుందని కాగ్ తెలిపింది. వాణిజ్య పన్నుల శాఖ ద్వారా రూ 31,816 కోట్లు, ఎక్సైజ్ ద్వారా రూ 18,604 కోట్లు, స్టాంపులు, రిజిస్ట్రేషన్శాఖ నుంచి రూ 8,473 కోట్లు, మోటారు వాహన పన్ను ద్వారా రూ 6,992 కోట్లు,ఇతర పన్నులుమొత్తం రూ 905 కోట్ల ఆదాయం వచ్చిందని కాగ్ తమ నివేదికలో పేర్కొంది.

### తెలంగాణ ఆర్థిక వ్యవస్థ – బలం, బలహీనతలు

రాష్ట్ర జీఎస్డీపీ భారీగా పెరగడమని ఆర్థిక రంగ నిపుణులు చెబుతున్నారు.202425 నాటికి తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి సుమారు రూ 16.4 లక్షల కోట్లకు చేరింది. తెలంగాణ ఏర్పాటైన 2014లో ఇది సుమారు రూ 5 లక్షల కోట్ల పరిధిలో ఉండగా, పదేళ్లలో మూడు రెట్లకుపైగా పెరిగింది.ఇందుకు హైదరాబాద్ ఐటీ రంగం అభివృద్ధి,ఫార్మా, బయోటెక్ పరిశ్రమలు,రియల్ ఎస్టేట్,సేవారంగం విస్తరణ, పారిశ్రామిక పెట్టుబడులు కారణమని చెబుతున్నారు. దేశంలోని చాలా రాష్ట్రాలు కేంద్ర పన్నుల వాటా, కేంద్ర గ్రాంట్లపై ఆధారపడతాయి. కానీ తెలంగాణ పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది.మొత్తం ఆదాయంలో స్వంత ఆదాయం 79.16 శాతం కాగా కేంద్ర పన్నుల వాటా గా 12 నుంచి 15 శాతం ఆదాయం వస్తోంది. కేంద్ర గ్రాంట్లు – 5 నుంచి 8 శాతం అంటే రాష్ట్రం తన ఖర్చులను ఎక్కువగా భరిస్తోందని లెక్క. పన్నుల వసూళ్లలో హైదరాబాద్ కీలకంగా మారింది. ఆర్థిక శాఖ అంచనాల ప్రకారం రాష్ట్ర పన్ను ఆదాయంలో జీహెచ్ఎంసీ పరిధిలోని హైదరాబాద్ రంగారెడ్డి,మేడ్చల్ జిల్లాల నుంచే దాదాపు 60 నుంచి 70 శాతం వరకు ఆదాయం సమకూరుతోంది. దీనివల్ల తెలంగాణ ఆర్థిక వ్యవస్థ హైదరాబాద్‌పై అధికంగా ఆధారపడుతోందని నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వ వ్యయంలో అత్యధిక భాగం సంక్షేమ పథకాలకే ఖర్చవుతోంది.ఇవే ప్రతి ఏడాది వేల కోట్ల రూపాయల వ్యయాన్ని పెంచుతున్నాయి. ఆర్థిక శాఖ లెక్కల ప్రకారం 2014లో రాష్ట్ర అప్పులు సుమారు రూ 72 వేల కోట్లు కాగా,2025 ఆర్థిక సంవత్సరం నాటికి మొత్తం అప్పులు రూ 3.91 లక్షల కోట్లకు చేరాయి. కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులు,సాగునీటి ప్రాజెక్టులు,మౌలిక వసతుల నిర్మాణం,సంక్షేమ కార్యక్రమాలు ఇందుకు కారణమని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వం నేరుగా తీసుకున్న అప్పులతో పాటు కార్పొరేషన్లు,ప్రభుత్వ సంస్థలు,ప్రత్యేక ప్రయోజన సంస్థలు తీసుకున్న రుణాలకు ప్రభుత్వం గ్యారంటీలు ఇచ్చింది.కాగ్ నివేదిక ప్రకారం ఈ గ్యారంటీలు కూడా గత దశాబ్దంలో గణనీయంగా పెరిగాయి. భవిష్యత్తులో ఇవి ప్రభుత్వానికి గుది బండగా మారి అదనపు భారం మోపే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.




### పెరుగుతున్న అప్పుల ముప్పు

రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరుగుతున్నప్పటికీ అప్పుల భారం కూడా అంతే వేగంతో పెరిగిపోతున్నాయి. తెలంగాణ మొత్తం ప్రజా రుణంరూ 3,91,881 కోట్లుగా ఉంది.ఇది రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్డీపీ)లో 23.88 శాతంగా నమోదైంది. అప్పులు ప్రస్తుతం చట్టబద్ధ పరిమితుల్లోనే ఉన్నప్పటికీ, గత దశాబ్దంలో అప్పుల పెరుగుదల వేగంగా పెరిగిందని కాగ్ నివేదిక లో తెలియజేసింది



### ఎందుకు రెవెన్యూ లోటు ?

202425 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ లోటు నమోదుచేసిన 15 రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచింది.అంటే ఆదాయ వ్యయం,ఆదాయ వసూళ్లు. అయితే సానుకూల అంశం ఏంటంటే రెవెన్యూ వ్యయంలో 90 నుంచి 100 శాతం వరకు ఆదాయ వసూళ్లు సమకూర్చగలిగింది.అంటే లోటు ఉన్నప్పటికీ అది అదుపులోనే ఉందని నివేదిక సూచిస్తోంది.గత కొన్నేళ్లుగా తెలంగాణలో ప్రభుత్వాలు సంక్షేమ పథకాలకు,అభివృద్ధి కార్యక్రమాలకు భారీ ఎత్తున నిధులను వెచ్చిస్తున్నారు. ఇందులో భాగంగా రైతు భరోసా,ఉచిత విద్యుత్, ఆసరా పెన్షన్లు,మహిళా సంక్షేమ పథకాలు, సాగునీటి ప్రాజెక్టులు,మౌలిక వసతుల అభివృద్ధి ప్రధానమైన వాటిలో కీలకంగా నిలిచాయి.ఈ పథకాల అమలుకు భారీ వ్యయ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ పథకాలు,కార్యక్రమాలు ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తున్నప్పటికీ ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడుతోందని ఆర్థికరంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం రెండు విభిన్న చిత్రాలను చూపిస్తోందని,బలమైన జీఎస్టీ వసూళ్లు,అధిక స్వంత ఆదాయం,పరిశ్రమలు, ఐటీ రంగం నుంచి ఆదాయం,స్థిరమైన పన్ను వృద్ధి అండగా నిలుస్తున్నాయని తెలంగాణ ప్రభుత్వం చెబుతుండగా బలహీనతలు కూడా అదే స్థాయిలో ఉన్నాయని చెబుతున్నారు. పెరుగుతున్న అప్పులు,ఆర్బీఐ తాత్కాలిక రుణాలపై అధికంగా ఆధారపడటం,రెవెన్యూ లోటు,సంక్షేమఅభివృద్ధి వ్యయాల ఒత్తిడి ప్రభుత్వానికి ఇబ్బందిగా మారిందని విశ్లేషిస్తున్నారు. డాక్టర్ మారం శ్రీనివాస్



### ఆందోళన కలిగిస్తున్న ఆర్బీఐ రుణాలు

ప్రభుత్వం భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) నుంచి తీసుకుంటున్న రుణాల అంశంలో కాగ్ ఆందోళన వ్యక్తం చేసింది. కాగ్ వెల్లడించిన తమ నివేదికలో ఈ అంశం అత్యంత కీలక కావడం విశేషం.363 రోజుల పాటు ఆర్బీఐ నుంచి తెలంగాణ ప్రభుత్వం 202425లో మొత్తం 363 రోజులు వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ (ఎంఎంఏ) సదుపాయాన్ని వినియోగించింది. రాష్ట్రానికి తాత్కాలిక నగదు కొరత ఏర్పడినప్పుడు ఆర్బీఐ అందించే స్వల్పకాలిక రునాన్నే వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ అంటారు.సంవత్సరంలో దాదాపు ప్రతి రోజూ ఈ సదుపాయాన్ని ఉపయోగించడం నగదు నిర్వహణలో సమస్యలు ఉన్నట్లు సూచిస్తోందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్‌తో కలిసి తెలంగాణ ఈ రుణాల వినియోగంలో అగ్రస్థానాల్లో నిలిచింది



### ఎక్సైజ్ ఆదాయంలోనూ తెలంగాణ రాష్ట్రం రికార్డు బద్దలు కొట్టింది.

201516 ఆర్థిక సంవత్సరంలో ఆబ్కారీ శాఖ ఆదాయం రూ 3,809 కోట్లు ఉండగా 202425 నాటికి దాదాపు ఆరు రెట్లు పెరిగి రూ 18,604 కోట్లకు చేరింది.388 శాతం వృద్ధి నమోదైంది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఇదే అత్యధిక వృద్ధిగా కాగ్ తెలంగాణ సర్కార్ ను ప్రశంసించింది.ఎక్సైజ్ వసూళ్లలో తెలంగాణ దేశంలో అగ్రశ్రేణి రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచిందని కితాబిచ్చింది.



-డాక్టర్ మారం శ్రీనివాస్














# రైతుల సంక్షేమమే ధ్యేయం

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్

యాదాద్రి భువనగిరి జూన్ 24 మహా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అడ్డగూడూర్ మండలం రేపాక గ్రామ శివారులో గల ఇండిస్ట్రియల్ పార్క్ నిర్మాణం కోసం 10మంది రైతులకు ఎకరానికి 12 లక్షలు చొప్పున ఎమ్మెల్యే మందుల సామేలు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి చేతుల మీదుగా రైతులకు బుధవారం చెక్ లను అందజేశారు. ఈ సందర్భంగా ఏమ్మెల్యే మందుల సామెల్ మాట్లడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూసేకరణ చేసే అధికారం ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, రైతుల ప్రయోజనాలను కాపాడటమే తమ ముఖ్య ఉద్దేశమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ స్పష్టం చేశారు. డి రేపాక గ్రామ రైతుల భూములకు సంబంధించిన పరిహారం విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో నిర్ణయించిన రేటు ప్రకారం ఎకరాకు కేవలం రూ. 6 లక్షలు మాత్రమే ఇచ్చే అవకాశం ఉండేదన్నారు. అయితే, దశాబ్దాలుగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న రైతుల పరిస్థితిని వివరించడానికి తాను స్వయంగా జిల్లా కలెక్టర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యానని పేర్కొన్నారు. రైతుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని, నిర్ణయించిన రూ. 6 లక్షలకు తోడుగా మరో రూ. 6 లక్షలు కలిపి అందించాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఇందుకు అంగీకరించిన కలెక్టర్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.రైతులతో పబ్లిక్ హియరింగ్ నిర్వహించి, ఈ ప్రక్రియను వేగవంతం చేసినందుకు స్థానిక ఆర్డీఓకు, అలాగే ఇందుకు పూర్తిగా సహకరించిన మోత్కూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డికి, సర్పంచ్‌కు, గ్రామ రైతులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి,తహసీల్దార్ ఎ. శేషగిరి రావు,డిప్యూటీ తహసీల్దార్ నరసింహ రావు, నగేష్ కుమార్,రెవిన్యూ ఇన్స్పెక్టర్, మాదవి GPO రేపాక గ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- యాక్షన్ ప్లాన్ నిరంతర ప్రక్రియగా కొనసాగాలి
- జిల్లా ప్రత్యేక అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు



**ఆదిలాబాదు మహా** : ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' నిరంతర ప్రక్రియగా కొనసాగాలని జిల్లా ప్రత్యేక అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి ఆయన జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్చి 6 నుండి జూన్ 12 వరకు జరిగిన ఈ 99 రోజుల కార్యక్రమానికి సంబంధించి, ముఖ్యమంత్రి z క్యాబినెట్ మంత్రుల ఆదేశాల ప్రకారం 10 విభాగాలలో నిర్దేశించిన పనులను అధికారులు క్షేత్రస్థాయిలో ముమ్మరంగా ప్రజల్లోకి తీసుకెళ్లారని వెల్లడించారు. అయితే, ఈ 99 రోజుల కార్యక్రమం ముగిసినప్పటికీ, ఇక్కడితో ఇది ఆగిపోకుండా భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో నిరంతరం కొనసాగేలా పర్యవేక్షించడానికే ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్లను నియమించిందని స్పష్టం చేశారు.గ్రామసభలు, మండల స్థాయి సమావేశాలలో ప్రజల నుండి సేకరించిన వ్యక్తిగత, కమ్యూనిటీ సంస్థాగత వినతులను అన్ని శాఖల అధికారులు క్రోడీకరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన అనుభవాలు, ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ప్రతి శాఖ రాబోయే ఒకటి లేదా రెండు సంవత్సరాల కాలానికి గాను ఒక సమగ్రమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సీఎం, డిప్యూటీ సీఎం, జిల్లా ఇంచార్జ్ మంత్రుల పర్యటనల సందర్భంగా జిల్లాలో జరిగిన శంకుస్థాపనలు, మంజూరైన జీవోలకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి పనులను త్వరితగతిన గ్రౌండ్ ేయాలని, సీఎం ఇచ్చిన హామీలపై నిరంతరం ఫాలోఅప్ ఉండాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో చేపట్టిన అన్ని మంచి ఇనిషియేటివ్స్ నిరంతరం కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, జిల్లాలోని 131 రెసిడెన్షియల్ విద్యాసంస్థలను జిల్లా అధికారులు రెగ్యులర్‌గా సందర్శించి అక్కడి పరిశుభ్రతను, ముఖ్యంగా విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించాలని ప్రత్యేక అధికారి స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి 6 నుండి జూన్ 12 వరకు జిల్లాలో పారిశుధ్యం, ఆరోగ్యం, ఫైల్స్ క్లియరెన్స్ వంటి ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టిసారిస్తూ పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. నిరుద్యోగ యువత కోసం ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు మంచి స్పందన లభించిందనీ, జిల్లాలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రి, డీజీపీల పర్యటనలు విజయవంతంగా ముగిశాయయని, ఇంచార్జ్ మంత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు, ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు, కుట్టు మిషన్ల పంపిణీ జరగ్గా, డీజీపీ మత్తుపదార్థాల నియంత్రణపై యువతకు అవగాహన కల్పించారనీ వివరించారు.ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల బుక్‌లెట్ తో పాటు జిల్లా సాధించిన విజయాలు, సంక్షేమ లబ్ధి, ఫిర్యాదుల పరిష్కారం నూతన ఆవిష్కరణలతో కూడిన "సమగ్ర ప్రగతి నివేదికను" త్వరలోనే ప్రభుత్వానికి సమర్పించనున్నారు.అనంతరం జిల్లా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కు సంబంధించిన బుక్‌లెట్ ను ప్రత్యేక అధికారి ఆవిష్కరించారు.ఈ సమీక్ష సమీవేశంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్.చిత్రు, రాజేశ్వర్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశం దరఖాస్తుల స్వీకరణ

**కరీంనగర్ ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్**

**మంచిర్యాల, మహా :** 202627 విద్యా సంవత్సరానికి గాను కరీంనగర్ లోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో 1వ తరగతి నుండి పదవ తరగతి వరకు ఇంగ్లీష్, 10 వ తరగతి తెలుగు మీడియం లలో ప్రవేశం కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఆ పాఠశాల ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వయసు 6 నుండి 14 సంవత్సరాల మధ్య ఉండాలని, అంధ బాలబాలికలు ఉత్తర తెలంగాణ రాష్ట్ర నివాసులై ఉండాలని, ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్, వరంగల్ జిల్లాల వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వెల్లడించారు. పాఠశాలలో ఉచిత విద్య, పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫామ్, పాదరక్షలు, వసతి గృహ సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. దరఖాస్తు చేసుకునేందుకు సదరం అండ్ యు డి ఐ డి దివ్యాంగ ధ్రువపత్రం, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, బదిలీ సర్టిఫికెట్, 2 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో కరీంనగర్ లోని విజయపురి కాలనీ, మల్కాపూర్ రోడ్డులో గల ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో అందించాలని తెలిపారు. ఇతర వివరాలకు 9701190127, 9440338424 లలో సంప్రదించవచ్చని తెలిపారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : సిఐ రవికుమార్.!

**ఇబ్రహీంపట్నం జూన్ 24 మహా:** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆదిభట్ల సీఐ రవికుమార్ ఒక ప్రకటనతో తెలిపారు. రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో యువతకు సీఐ రవికుమార్ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ వాటిపై అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి డ్రగ్స్ వంటి వాటిని అమ్మిన కొన్న నేరంకిందనే పరిగణించబడుతుందని, ఇలాంటి వాటికి దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని, మత్తు పదార్థాలకు బానిసలు అయితే జీవితం నాశనమవుతుందని సూచించారు. అనవసరమైన వాటి జోలికి వెళ్లకుండా ఉండాలని, లేనియెడల కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆదిభట్ల సీఐ రవికుమార్ హెచ్చరించారు.





# ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల దందా

- భద్రతా ప్రమాణాల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలి
- బీజేపీ పట్టణ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా**: పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక ఫీజుల భారం మోపుతున్నాయని బీజేపీ పట్టణ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారినికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రుల నుండి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై సమగ్ర విచారణ జరిపి నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఈవోని కోరారు. పలు ప్రైవేట్ పాఠశాలల్లో ఫిట్‌నెస్ లేని పాఠశాల బస్సులు నడుస్తున్నాయని అవసరమైన అనుమతులు లేకుండానే రవాణా సేవలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అదే విధంగా అనేక పాఠశాలల్లో ఫైర్ సేఫ్టీ(అగ్నిమాపక) అనుమతులు లేకపోవడం విద్యార్థులకు ఆటస్థలాలు (ప్లేగ్రౌండ్స్) లేకపోయినా అనుమతులు పొందడం వంటి అంశాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. విద్యార్థుల భద్రత నాణ్యమైన విద్య తల్లిదండ్రుల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ ఎల్లప్పుడూ పోరాడుతుందని శీలం విద్యాసాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి కలంకార్ రాజశేఖర్, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, అలివేలు, పట్టణ కార్యదర్శి సుహాసిని, మహిళా మోర్చా అధ్యక్షులు యామిని, ఎస్టి మోర్చా అధ్యక్షులు భూక్యా పూర్ణ, ఎస్సీ మోర్చా అధ్యక్షులు హృదయ్, బీజేపీ జిల్లా నాయకులు నోముల రమేష్, ఆది మూల రాములు, రాయుడు నాగేశ్వరరావు, రాజమౌళి కార్యకర్తలు ఉమామహేశ్వరరావు భాస్కర్ గౌడ్, జగదీష్, రవి శంకర్ పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పేదల 60 గజాల ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు అండగా ఉంటా

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య




**మొయినాబాద్ మహా**: గతంలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి మళ్లీ అదే స్థలంలో మార్కెట్ యార్డులను ఏర్పాటు చేయడం సరికాదని వెంటనే హిమాయత్ నగర్ గ్రామస్థులకు ఇళ్లపట్టాలు అందజేసి ఇల్లు నిర్మించుకునేందుకు కృషి చేయాలని గుడిమల్కాపూర్ మార్కెట్ ఏర్పాటు విషయంపై పేదలకు అన్యాయం జరగకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డిలు దృష్టి సారించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య తెలిపారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హిమాయత్ నగర్ సర్వే నంబర్ 151 లోని ప్రభుత్వ భూమిలో గతంలో ప్రభుత్వం 60 గజాల ఇళ్ల స్థలాల పట్టాలను ఇవ్వగా ప్రస్తుతం అదే సర్వే నెంబర్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుడిమల్కాపూర్ మార్కెట్ యార్డును ఏర్పాటు చేస్తుండడంతో హిమాయత్ నగర్ గ్రామస్థులు శాంతి యువజన సంఘం, అంబేద్కర్ యువజన సంఘం, మౌలాన అబ్దుల్ కలం అజాద్ మైనార్టీ యువజన సంఘం, సేవాలాల్ యువజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. తమకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో ప్రభుత్వం మార్కెట్ యార్డును ఏర్పాటు చేయడం సరికాదని తమకు ఇల్లు నిర్మించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని బాధితులు ధర్నా చేపట్టారు. వీరికి ఆర్ కృష్ణయ్య మద్దతుగా నిలిచి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలో అనేక ప్రభుత్వ భూములు ఉన్నాయని ప్రభుత్వ భూములను బడాబాబులు కబ్జా చేశారని వారి నుంచి ప్రభుత్వం భూములను స్వాధీన పరుచుకోవాలన్నారు. పేద ప్రజలకు గతంలో ఇచ్చిన భూములను తీసుకోవడం సరికాదని ఈవిషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డిలు దృష్టి పెట్టాలని సూచించారు. పేదల నుంచి భూములను తీసుకొని మార్కెట్ యార్డు ఏర్పాటు చేయడం సరికాదని జిల్లాల్లో అనేక భూములు ఉన్నాయని అందులో మార్కెటు యార్డు ఏర్పాటు చేయాలని సూచించారు. హిమాయత్ నగర్ గ్రామస్థులకు ఇళ్ల పట్టాలను అందజేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తు కార్యచరణతో ఉద్యమానికి శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. పేద ప్రజలకు అన్యాయం చేయవద్దని తెలిపారు. నిజంగా చెప్పాలంటే మొయినాబాద్ మండలం హిమాయత్ నగర్ గ్రామ ప్రజలు ఎంతో అదృష్టవంతులు అని తెలిపారు. గ్రామంలో జరిగిన అన్యాయాన్ని హైదరాబాదులో తమ గళాన్ని వినిపించడం వారి పట్టుదలకు నిదర్శనమని ఆర్. కృష్ణయ్య తెలిపారు. ఇలా అందరూ ఏకతాటిపై ఉండి అన్యాయాలను ఎదిరించి పోరాడితే భవిష్యత్తులో మరింత పోరాట పటిమ పెరుగుతుందని ప్రజల పక్షాన పోరాటం చేసే అవకాశం వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ భాస్కర్ మాట్లాడుతూ నగర శివారు మొయినాబాద్ లో అనేక మంది బడాబాబులు ప్రభుత్వ భూముల పై కబ్జా లో ఉన్నారని రెవెన్యూ అధికారులకు అవి కనపడడం లేదా అని ప్రశ్నించారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన సమీక్ష సమావేశంలో ప్రభుత్వ భూములను ప్రజాప్రతినిధులే కబ్జా చేశారని సమాచారం బట్టబయలైందని గుర్తు చేశారు.చేవెళ్ల నియోజకవర్గంలో రెవెన్యూ అధికారులు రూ. కోట్ల డబ్బులు సంపాదించారని ఆరోపించారు. పేదలకు దక్కాల్సిన భూములను బడాబాబులు కబ్జా చేశారని వీరికి రెవెన్యూ అధికారుల అండదండలు సంపూర్ణంగా ఉన్నాయని ఆరోపించారు. హిమాయత్ నగర్ లోని పలు యువజన సంఘాల అధ్యక్షులు కుమ్మరి విఠల్, కట్టమీది శ్రీను కరీం గోపాల్ నాయక్ నాయకులు గ్రామస్థులు ఉన్నారు.



## సిపిఐ రాజకీయ శిక్షణ తరగతులకు పిలుపు

**రాజేంద్రనగర్, మహా:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల నాయకులు, కార్యకర్తల కోసం రాజకీయ శిక్షణ తరగతులను జూన్ 25, 26 తేదీల్లో శంషాబాద్‌లోని ఎలైట్ హోటల్‌లో నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తెలిపారు.బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న పార్టీ సిపిఐ మాత్రమేనని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలను విస్మరించాయని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజల హక్కుల పరిరక్షణకు సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొంటూ, జూన్ 25, 26 తేదీల్లో జరిగే రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# దోపిడిదారుల మాటలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదు..?

- బీఆర్ఎస్ భవిష్యత్ లేని పార్టీగా అభివర్ణించిన ఎమ్మెల్యే
- ఎస్ఐఆర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని మల్ రెడ్డి సూచన...
- అబ్దుల్లాపూర్ మెట్ మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం
- బాటసింగారంలో నూతన గోదాముకు శంకుస్థాపన



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా**: ఇతర నియోజకవర్గాలు అసూయపడేలా ఇబ్రహీంపట్నం ప్రాంతానికి నిధులు తెచ్చి, అభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారు తెలిపారు. ఊరూవాడ మెరిసేలా కేవలం రోడ్ల నిర్మాణ కోసమే ఇప్పటికే రూ.700కోట్లు కేటాయించినట్లు చెప్పారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి..... వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా, బాటసింగారం రైతు సేవా సహకార సంఘం నూతన గోదాముకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు పాలకవర్గం ఎమ్మెల్యే గారిని ఘనంగా సన్మానించింది. అనంతరం, ఏర్పాటు చేసిన సమావేశంలో మల్ రెడ్డి రంగారెడ్డి రైతులనుద్దేశించి ప్రసంగించారు.

**రైతులకు తొలిప్రాధాన్యం...**

దేశంలోనే అతిపెద్ద మార్కెట్ కోహెడలో ఏర్పాటు కానుందని ఎమ్మెల్యే తెలిపారు. ఇది పూర్తయ్యాక ఈ ప్రాంతానికి చెందిన 20వేల మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అన్నదాత సంక్షేమమే తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని చెప్పారు.

**అలాంటి వారిని తరిమికొట్టండి...**

15ఏళ్ళు నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా ఆగం చేసిన వారు... అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. దోపిడిదారులను, అడ్డాకూలీలను తెచ్చి పిచ్చి ఆరోపణలు చేయిస్తే, ప్రజలు నమ్మే పరిస్థితిలేదన్నారు. అభివృద్ధికి అడ్డుపడుతున్న వారిని గ్రామాలను నుంచి తరిమికొట్టాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే చెప్పారు.

**పదిపదేహేనేళ్లు రేవంత్ రెడ్డే...**

బీఆర్ఎస్ పార్టీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలాంటిదని... ఇకదానికి భవిష్యత్ లేదని మల్ రెడ్డి రంగారెడ్డిగారు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అందరిదని... ఇంకా పదిపదిహేనేళ్లు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఉంటారని దీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలందరికీ తాను అండగా ఉంటానన్న మల్ రెడ్డి.... ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలందరికీ అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**ప్రజాసంక్షేమమే లక్ష్యంగా...**

ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పేదలకు సన్నబియ్యం, రాయితీపై గ్యాస్, అన్నదాతలకు రైతుభరోసా, భీమా, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, పెన్షన్లు, ఇలా సంక్షేమ రాజ్యమే లక్ష్యంగా పథకాలు అమలుచేస్తున్నట్లు తెలిపారు.

**నమ్మకాన్ని నిలబెట్టుకుంటా...**

నియోజకవర్గంలో అధ్వాన పరిస్థితులను సహించలేక రాజకీయాలకతీతంగా ప్రజలు ఏకమై తనను భారీ మెజార్టీతో గెలిపించారని, వారిని నమ్మకాన్ని నిలబెట్టుకోవటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. అందుకోసమే హైదరాబాద్ లో కాకుండా తొర్రూర్ లోనే అందరికీ అందుబాటులో ఉంటున్నట్లు మల్ రెడ్డి తెలిపారు.

**ఎస్ఐఆర్ పట్ల అప్రమత్తత అవసరం....**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ ఓట్ల తొలగింపు కుట్ర చేస్తోందని... ఈ క్రమంలోనే చేపట్టిన ఎస్ఐఆర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని పార్టీ కార్యకర్తలకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అర్హులైన వారి ఒక్క ఓటు కూడా తొలగించకుండా చూసే బాధ్యత ప్రతీ కార్యకర్త తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, బాటసింగారం బ్యాంకు ఛైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి, డైరెక్టర్లు, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూధన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణపై బీఎల్ఏలకు శిక్షణ

**యాదాద్రి భువనగిరి, జూన్ 24 (మహా)**: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రంో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు బీర్ల అయిలయ్య పాల్గొన్నారు.రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు కావడం, అనర్హుల పేర్ల తొలగింపు, వివరాల సవరణ వంటి అంశాలపై బీఎల్ఏలకు సమగ్ర అవగాహన కల్పింvచారు. ఈ సందర్భంగా అయిలయ్య మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేరు లేదా ఇతర వివరాల్లో ఉన్న తప్పులను సరిచేయించే ప్రక్రియలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని, పార్టీ శ్రేణులు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీల వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అయిలయ్య అన్నారు. విద్యార్థుల ప్రయోజనాల కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన "చాత్రింకి గుంజ్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే సీబీఎస్ఈ పేపర్ల మూల్యాంకనంలో జరిగిన అవకతవకల వల్ల పలువురు విద్యార్థులు తీవ్ర నిరాశకు గురయ్యారని అన్నారు.



## ఫుడ్ సేఫ్టీ అధికారి తనిఖీలు

**నిర్మల్ మహా:** ఫుడ్ సేఫ్టీ అధికారి సునీత పట్టణంలోని మిఠాయి దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ దాడులలో పలు దుకాణాలలో గడువు తీరిన మిఠాయిలు, చాక్లెట్లు, లేబుళ్ల లేని ఆహార పదార్థాలను గుర్తించారు. ఆయా మిఠాయి దుకాణాలపై తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. దుకాణదారులంతా ఆహార పదార్థాలకు సంబంధించి లేబుళ్ల తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆహార పదార్థాల గడువు ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ, గడువు తీరిన ఆహార పదార్థాలను దుకాణాల నుంచి తొలగించాలని తెలిపారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

- ఐటీసీ కార్మికులకు డ్రగ్స్‌పై అవగాహన అవసరం
- ఎస్ఐ మేడా ప్రసాద్

**బూర్గంపహాడ్, మహా :** మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని,మత్తు పదార్థాల వల్ల కుటుంబాలు నాశనమవుతాయని, డ్రగ్స్ వాడకం, విక్రయానికి పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని బూర్గంపహాడ్ ఎస్ఐ మేడా ప్రసాద్ హెచ్చరించారు. సారపాకలోని ఐటీసీ కర్మాగారంలో కార్మికులకు డ్రగ్స్ దుష్ప్రభావాలపై బుదవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కార్మికులకు సూచించారు. "మత్తు పదార్థాల వల్ల ఒక్కరి జీవితమే కాదు, మొత్తం కుటుంబం రోడ్డున పడుతుందని చెప్పారు. ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదైతే జీవితం జైలుపాలవుతుంది అని తెలిపారు.పరిసర ప్రాంతాల్లో ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తున్నా, సరఫరా చేస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఐటీసీ కర్మాగార అధికారులు, సిబ్బంది, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి.!

- **సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా**: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఆర్డీవోకు వినతి పత్రం అందజేసిన సీఐటీయూ నాయకులు. తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, బుధవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఆర్డిఓకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ... గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించి పర్మనెంట్ చేయాలని, మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని ప్రభుత్వాన్ని సిఐటియు నాయకులు డిమాండ్ చేసినట్లు తెలిపారు. జీవో 51 ప్రకారం సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్స్ సబ్బులు, నూనెలు ఇతర సామాగ్రి ఇవ్వాలని, జీవో 51ని అమలు చేయని పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవోని కోరడం జరిగిందన్నారు. అదేవిధంగా పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ అనేకమంది పంచాయతీ కార్మికులు అనారోగ్యాల పాలై చనిపోతున్నారని వారికి వెంటనే బీమా సౌకర్యం కల్పించాలని ఈఎస్ఐపిఎఫ్ అమలు చేయాలని వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. 2011 జనాభా లెక్కల ప్రకారం పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లిస్తున్నారని, అలా కాకుండా ప్రస్తుత జనాభాకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కనీస వేతనం 26,000 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు షాబాద్ మండల ఉపాధ్యక్షులు మామిడిపల్లి నరసింహ, గ్రామపంచాయతీ యూనియన్ చేవెళ్ల మండల కార్యదర్శి ఆసిఫ్, చేవెళ్ల మండల ఉపాధ్యక్షులు రాములు, మహిళ నాయకురాలు మేనక, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## రక్తదాతలంతా ప్రాణదాతలే...

- **అదనపు కలెక్టర్ వెంకారెడ్డి**

**యాదాద్రి భువనగిరి జూన్ 24 మహా** రక్తదాతలంతా ఆపదలో ఉన్నవారికి ప్రాణదాతలేనని యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ వెంకారెడ్డి అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం రెడ్ క్రాస్ డివిజన్ చైర్మన్,వివేరా హోటల్స్ అధినేత సద్ది వెంకటరెడ్డి జన్మ దినాన్ని పురస్కరించుకొని బుధవారం వివేరా హోటల్స్ సిబ్బందిచే భువనగిరి బైపాస్ రోడ్డు లోని న్యూ వివేరా హోటల్ లో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని వెంకారెడ్డి ప్రారంభించారు. నేటి యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రమాదాలు సంభవించినప్పుడు ఆపదలో ఉన్నవారికి,తలసేమియా రోగులకు సరిపడా రక్తాన్ని అందించాలంటే రక్త దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. రెడ్ క్రాస్ డివిజన్ చైర్మన్ సద్ది వెంకటరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఐదేళ్లుగా వివేర హోటల్స్ లో పని చేసే సిబ్బంది రక్తదానం చేయడం వారితో పాటు వివేరా హోటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ సద్ది రాఘవేందర్ రెడ్డి కూడా రక్తదానం చేయడం అభినందనీయమని వెంకా రెడ్డి అన్నారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి లక్ష్మీనరసింహారెడ్డి మాట్లాడుతూ రక్తాన్ని తయారు చేయించలేమని దాతల నుంచి సేకరించాల్సిందేనని, అందుకే రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. రక్తాన్ని సేకరించడంలో రెడ్ క్రాస్ జిల్లాలోనే ముందు ఉందని పేర్కొన్నారు. ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య రక్తదాన శిబిరాన్ని సందర్శించి రక్తదాతాలను అభినందించారు. సద్ది వెంకటరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయనను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ విద్యానగర్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో ఈ శిబిరంలో వివేరా హోటల్స్ సిబ్బంది 61 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ దిడ్డి బాలాజీ, కోశాధికారి డి అంజయ్య,జిల్లా డైరెక్టర్లు శేక్.హమీద్ పాశ,కే ప్రభాకర్ రెడ్డి, పన్నాల శ్రీనివాసరెడ్డి, ఎస్ ఎన్ చారి,జంపాల అంజయ్య, ప్రతినిధులు రామ్ రెడ్డి,విజయ్, క్రిస్టోఫర్, చంద్రశేఖర్, ఎస్పీ ఉపేందర్, స్పందన, లావణ్య, హనీఫ్,బండారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ డివిజన్ చైర్మన్ సద్ది వెంకటరెడ్డిని జన్మదినాన్ని పురస్కరించుకొని ఘనంగా సన్మానించారు.

## డ్రగ్స్ పై కలిసి పోరాడుదాం..

- మహమ్మారిని అంతం చేద్దాం..
- జిల్లా వాసులకు ఎస్పీ పిలుపు
- సంతకాల సేకరణ

**ఆదిలాబాదు మహా** : యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలపై సమాజమంతా కలిసి పోరాడాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపునిచ్చారు. బుధవారం ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా డ్రగ్స్ కు వ్యతిరేకంగా పోరాడుతామని ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ కార్యక్రమం "వాల్ ఆఫ్ ప్రామిస్" లో ఆయన పాల్గొని సంతకం చేశారు. గంజాయికి దూరంగా ఉండాలని, గంజాయి రహిత ఆదిలాబాద్ జిల్లా నిర్మాణానికి కృషి చేస్తానని తన ప్రతిజ్ఞను నమోదు చేశారు. డ్రగ్స్ మరియు మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్‌లలో ప్రత్యేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున డ్రగ్స్‌కు వ్యతిరేకంగా తమ మద్దతు ను తెలియజేసి సంతకాలు చేశారు. డ్రగ్స్ లేని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గంజాయి బారిన పడిన వారి సమాచారం, గంజాయి పై ఉన్న సమాచారాన్ని పోలీసులకు తెలియజేసి బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి బారిన పడిన యువతకు సరైన చికిత్స ద్వారా నయం చేయవచ్చని, పునరావాస కేంద్రాల ద్వారా నయం చేసి తిరిగి సాధారణ జీవితాన్ని గడిపేలా పోలీసు యంత్రం కృషి చేస్తుందని, తల్లిదండ్రులు డ్రగ్స్ బారిన పడిన వారిని చికిత్స కేంద్రాలకు తరలించి చికిత్సను అందించేలా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా యాంటీ డ్రగ్స్ సోల్జర్ గా పోరాడుతామని డ్రగ్స్ వ్యతిరేకంగా పోరాడుతామని ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర కేంద్రం వద్ద ఫోటోలను దిగి తమ సామాజిక మాధ్యమాల కేంద్రాలలో పొందుపరచాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్, ఇన్స్పెక్టర్లు కె ఫణిదర్, ప్రణయ్ కుమార్, ఎస్ఐలు అశోక్, సంజయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలి

- రాజకీయ పార్టీల సహకారం కీలకం
- సమీక్షా సమావేశంలో కలెక్టర్ రాజర్షి షా వెల్లడి



**ఆదిలాబాదు మహా** : జిల్లాలో ఈ నెల 25వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి ఏజెంట్లు పూర్తి స్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా కోరారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా అత్యంత కీలకమైందని, ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో పేరు నమోదు కావడంతో పాటు, అనర్హుల పేర్లు తొలగించే ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని ఆయన అన్నారు.జూన్ 25 నుండి జూలై 24 వరకు నిర్వహించే ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తారని తెలిపారు. ఓటర్లు పూర్తి చేసిన ఫారాలను బీఎల్‌వోలు తిరిగి సేకరించి, అందులోని వివరాలను నిరంతరం యాప్‌లో నమోదు చేస్తారని వివరించారు.ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు చురుకుగా పాల్గొని, ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పించడంతో పాటు ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లు, అభ్యంతరాలు లేదా లోపాలు తలెత్తకుండా రాజకీయ పార్టీలు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని తహసీల్దార్లు, సూపర్వైజర్లు, ఎన్నికల అధికారులు, జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తారని తెలిపారు. ప్రతి అర్హుడైన ఓటరుకు తన ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు.ఓటరు జాబితా మరింత ఖచ్చితత్వంతో రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు నిర్మాణాత్మక సూచనలు అందించాలని, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, జిల్లా రెవెన్యూ అధికారి స్రవంతి, ఆర్డీవో జగదీశ్వరరావు, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు తదితరులు పాల్గొన్నారు.



## ఆస్తికోసం కన్న తండ్రి పై తనయుడు దాడి...

**రాజేంద్రనగర్ మహా** : ఆస్తి కోసం కన్న తండ్రి పైనే విచక్షణారహితంగా దాడి చేసిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పరపల్లి కి చెందిన అనంతరెడ్డి తనకున్న 31 గుంటల భూమిలో తన వృద్యాప్యం కోసం 300 గజాల భూమిని వదిలి పెట్టి, మీగతది తన ఇద్దరు కుమారులయిన విజయ్ కాంత్ రెడ్డి, ఓం రెడ్డి లకు సమానంగా ఇచ్చాడు. 300 గజాల స్థలాన్ని తన పేరుపై ఉంచుకున్నాడు. తన పేరుపై ఉంచుకున్న 300 గజాల భూమిని కూడా తన చిన్న కుమారుడైన ఓం రెడ్డి తన తండ్రి అయిన అనంత రెడ్డి పై అందరు చూస్తుండగా విచక్షణారహితంగా దాడికి దిగాడు.300 గజాల భూమి తనపై రిజిస్ట్రేషన్ చేయకపోతే చంపేస్తానంటూ తన కుమారుడు బెదిరిస్తున్నాడని రాజేంద్రనగర్ పోలీసులకు తండ్రి అనంతరెడ్డి ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



## ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్ర... ప్రారంభించనున్న సీఎం...

- తెలంగాణ లంబాడి, ఎరుకల, యానాది తెగల రిజర్వేషన్ స్వర్ణోత్సవ వేడుకలు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా**: 1976 సెప్టెంబర్ 18న రిజర్వేషన్ హక్కులు పొందిన లంబాడి, ఎరుకల, యానాది తెగలు 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న రిజర్వేషన్ స్వర్ణోత్సవాల భాగంగా 2026 జూన్ 25 నుండి ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గాంధీ భవన్ వద్ద ప్రారంభించనున్నట్లు సంఘం పెద్దలు తెలిపారు.. యాత్ర అనంతరం మధ్యాహ్నం కడ్తాల మండలం మైసిగండిలో అమ్మ వారి దర్శనం నిర్వహించబడుతుంది. తదుపరి ఆమనగల్ పట్టణంలో జరిగే బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి శాసన సభ్యులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పాల్గొననున్నారు. కడ్తాల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు లంబాడీ, ఎరుకల, యానాది, గిరిజన సోదరులు ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బిచ్య నాయక్, డిసిసి అధికార ప్రతినిధి భిక్య నాయక్, సర్పంచ్ తేజ నాయక్, ఉప సర్పంచ్ హీరా సింగ్, ఉప సర్పంచ్ లకపతి నాయక్ బలరాం నాయక్, జగన్ నాయక్, రాజు నాయక్, యాట నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## అందగత్తెలకు కుటుంబ సౌఖ్యం ఉండదు.

**వేణుస్వామి వివాదాస్పద వ్యాఖ్యలు.**

**హైదరాబాద్, మహా. :** ప్రముఖ వివాదాస్పద జ్యోతిష్యుడు వేణుస్వామి మరోసారి తన సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. తాజాగా ఒక టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన.. మహిళల వివాహ బంధాలు, సినిమా ఇండస్ట్రీ, కలియుగంలో మనుషుల ప్రవర్తనపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. అందమైన అమ్మాయిలకు కుటుంబ సౌఖ్యం దక్కదంటూ ఆయన చేసిన వ్యాఖ్యానంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇంటర్వ్యూలో వేణుస్వామి మాట్లాడుతూ.. అందంగా ఉండే అమ్మాయిల భర్తలు త్వరగా చనిపోవడం లేదా వారు భర్తలతో విడిపోవడం జరుగుతుందని చెప్పుకొచ్చారు. అందమైన అమ్మాయిలకు కుటుంబ పరమైన సుఖసంతోషాలు ఉండకపోవడం అనేది ఇంద్రుడు ఇచ్చిన శాపమని ఆయన వ్యాఖ్యానించారు. సమాజంలో ఎంతోమంది అందగత్తెలను చూస్తే.. వారు తమ కంటే వయసులో చాలా పెద్దవారైన (ఏజ్ గ్యాప్ ఉన్న) వారిని పెళ్లి చేసుకోవడమో, లేదంటే ఎవరికైనా రెండో భార్యగా (సెకండ్ వైఫ్) వెళ్లడమో జరిగిందని అన్నారు. ఇందుకు ఉదాహరణగా సినిమా పరిశ్రమలోని చాలా మంది హీరోయిన్ల జీవితాలనే తీసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. చిత్ర పరిశ్రమలో ఎక్కువ మంది హీరోయిన్లు వయసు వ్యత్యాసం ఉన్న వారిని పెళ్లాడటం లేదా రెండో భార్యలుగా వెళ్లడం మనం చూస్తూనే ఉన్నామని వివరించారు.

ప్రస్తుత కలియుగంలో అమ్మాయిల మనస్తత్వాలు మారిపోయాయని వేణుస్వామి విమర్శించారు. ఈ రోజుల్లో అమ్మాయిలు తమను నిజాయితీగా ప్రేమించే వారి కంటే.. మోసం చేసే వారి వైపే ఎక్కువగా ఆకర్షితులవుతున్నారని అన్నారు. చుట్టూ ఎన్ని మంచి తులసి మొక్కలు ఉన్నప్పటికీ, వాటిని వదిలేసి వెళ్లి గంజాయి మొక్కనే పట్టుకుంటారంటూ ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. వివాహాల విషయంలో కొందరు చేస్తున్న తప్పులను కూడా ఆయన ఎండగట్టారు. చాలామందికి జాతకాలు కలవకపోయినప్పటికీ.. కేవలం పేర్లు మార్చుకుని మరీ పెళ్లిళ్లు చేసుకుంటున్నారని, అది శాస్త్రరీత్యా తీవ్రమైన తప్పిదమని స్పష్టం చేశారు. అలా చేయడం వల్ల జీవితంలో అనేక దోషాలు చుట్టుముడతాయని, ఎలాంటి దోషాలు లేకుంటేనే వివాహ బంధంలోకి అడుగుపెట్టాలని ఆయన హితవు పలికారు.

గతంలోనూ వేణుస్వామి ఇటువంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేసి పలుమార్లు వార్తల్లో నిలిచారు. అయితే, సినిమా ఇండస్ట్రీకి చెందిన రెండు మూడు ప్రముఖ జంటలు విడిపోతాయని ఆయన ముందుగానే చెప్పిన జోస్యాలు నిజం కావడంతో.. సెలబ్రిటీలు, రాజకీయ నాయకులలో కొందరు ఆయన జాతకాలను బలంగా నమ్ముతుంటారు. ఈ క్రమంలోనే పలువురు ప్రముఖులు ఆయనతో ప్రత్యేకంగా దోష నివారణ పూజలు సైతం చేయించుకుంటూ ఉంటారు. తాజాగా ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు నెట్టింట మరోసారి హాట్ టాపిక్‌గా మారాయి.

## కాంగ్రెస్ మందమర్రి మండల కమిటీ నియామకం



**మందమర్రి, మహా** : మందమర్రి మండల కాంగ్రెస్ కమిటీని మంచిర్యాల జిల్లా డిసిసి అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి స్థానిక మండల అధ్యక్షులు కడారి జీవన్ కుమార్ లు ప్రకటించారు. మండల ఉపాధ్యక్షులుగా మాసు సంతోష్ కుమార్, కొండ గొర్ల సుమలత, ప్రధాన కార్యదర్శులుగా ఓదెల సంపత్ రావు,ఆకుల అంజయ్య,మేడ రాజన్న,గజ్జె మహేందర్, మీడియా ప్రతినిధిగా ఎగుడు రాయమల్లు, కార్యదర్శులుగా పెంచాల రాజలింగు, పైరాల శ్రీనివాస్, నర్సింగోల్ తిరుపతి, గొల్లపల్లి వెంకటేష్ గౌడ్,జరుకుల గోపాల్, కమిటీ సభ్యులుగా జాడిశంకర్, సుంకరి నంబయ్య, కుంటాల పోచయ్య, రాచకొండ కమల మోహన్ రావు, అనగందుల శ్రీనివాస్, ఐతే పోచం, దినేని రమేష్, ఎస్లావత్ ప్రేమ్ సాగర్, మీడియా కార్యదర్శిగా కొండపర్తి సందీప్, సోషల్ మీడియా సభ్యుడిగా దుర్గం రాజ్ కుమార్ ను నియమిస్తున్నట్లుగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మందమర్రి మండల అధ్యక్షులు కడారి జీవన్ కుమార్ మాట్లాడుతూ నియమించబడిన సభ్యులు తమ తమ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ప్రజలతో మరింత దగ్గరగా మమేకమై, పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అమలు చేస్తున్న పథకాలను, అభివృద్ధి నిధుల వివరాలను ఎప్పటికప్పుడు ప్రచారం చేయడంలో ముందు ఉండాలని కోరారు.

## ప్రభుత్వ విధులకు... ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు

**కాప్రా మండల తాసిల్దార్ మతిన్ హెచ్చరిక.**

కుషాయిగూడ,మహా : ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కాప్రా మండల తాసిల్దార్ మతిన్ హెచ్చరించారు. జవహర్ నగర్ లో బుధవారం కాప్రా మండల తాసిల్దార్ మతిన్ ఆదేశాల మేరకు జవహర్ నగర్ లో పలు ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు చేపట్టారని సమాచారం మేరకు బుధవారం గిరధవార్ సత్యనారాయణ సమక్షంలో పలు అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మతిన్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తే కటకటాల పాలు అవుతారని పలు అక్రమ కట్టడాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల పరిరక్షనే ధ్యేయమని తెలిపారు. ఫైరింగ్ కట్ట సమీపంలో వెలసిన అక్రమ నిర్మాణాలను పలు అక్రమ కట్టడాలను జెసిబి సహాయంతో కూల్చి వేసామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## పాస్‌పోర్ట్ పౌరసత్వ ధృవీకరణ పత్రం కాదు.

**ఢిల్లీ, మహా :** పాస్‌పోర్ట్ వినియోగం, పౌరసత్వ ధృవీకరణకు సంబంధించి కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ కీలక ప్రకటన చేసింది. భారతీయులకు జారీ చేసే పాస్‌పోర్ట్ దేశ పౌరసత్వాన్ని నిరూపించే అంతిమ పత్రం కాదని, అది కేవలం విదేశాలకు వెళ్లేందుకు ఉపయోగపడే అంతర్జాతీయ ప్రయాణ పత్రం మాత్రమేనని స్పష్టం చేసింది. ఒక వ్యక్తి విదేశాల్లో ఉన్నప్పుడు ఆయన జాతీయతను ధృవీకరించడానికి మాత్రమే ఇది ఉపయోగపడుతుందని తేల్చిచెప్పింది. పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేసిన ఈ అధికారిక ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. పౌరసత్వ గుర్తింపుపై గతంలో సుప్రీంకోర్టుతో పాటు ప్రభుత్వాలు పలుమార్లు స్పష్టత ఇచ్చినప్పటికీ.. తాజాగా మరోసారి క్లారిటీ ఇచ్చింది. కేవలం పాస్‌పోర్ట్ మాత్రమే కాకుండా ఆధార్, ఓటర్ ఐడీ కార్డులపైనా గతంలో అత్యున్నత న్యాయస్థానం ఇటువంటి తీర్పులే ఇచ్చింది. అవి కేవలం వ్యక్తిగత గుర్తింపు, ఓటు హక్కు వినియోగానికి, నివాస ధృవీకరణకు మాత్రమే పరిమితమని స్పష్టం చేసింది. ప్రస్తుత చట్టాల ప్రకారం.. జనన ధృవీకరణ పత్రాలు లేదా నిర్దేశిత సంవత్సరాల కంటే ముందు నుంచి తల్లిదండ్రులు దేశంలోనే నివసించినట్లుగా నిరూపించే కేంద్ర ప్రభుత్వ అధికారిక పత్రాలే పౌరసత్వానికి అసలైన ఆధారాలని విదేశాంగ శాఖ ఈ సందర్భంగా పునరుద్ఘాటించింది.ఇదే వేదికపై దేశంలో పాస్‌పోర్ట్ సేవల నెట్‌వర్క్ విస్తరణ, చిప్ ఆధారిత ఇపాస్‌పోర్ట్‌ల విజయాలను మంత్రిత్వ శాఖ పంచుకుంది.



## అంగరంగ వైభవంగా నాభి శిల ప్రతిష్టాపన...

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ సర్కిల్ పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో బుధవారం అంగరంగ వైభవంగా బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగాభారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగరంగ వైభవంగా బొడ్రాయి ప్రతిష్టాపన నిర్వహించిన గ్రామసభ్యులందరిని అభినందించారు. అమ్మవారి చల్లని ఆశీస్సులు దీవెనలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అందరు కలిసి ఐక్యమత్యంగా మంచి కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించినందుకు మరొసారి అందరికీ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, దేవాలయ కమిటీ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి పనులపై ప్రపంచ బ్యాంకు ఆరా

- **రాజధానిలో మౌలిక వసతుల కల్పనపై క్షేత్రస్థాయి పరిశీలన.**
- **ఎస్ఆర్ఎమ్ వర్సిటీలో నైపుణ్య శిక్షణా కార్యక్రమాలపై ఆరా.**

**అమరావతి, మహా :** ప్రజా రాజధాని అమరావతిలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ప్రపంచ బ్యాంకు దక్షిణాసియా ఉపాధ్యక్షుడు జోహన్నెస్ జుట్, లీడ్ ట్రాన్స్‌పోర్ట్ స్పెషలిస్ట్, అమరావతి సమగ్ర పట్టణాభివృద్ధి ప్రాజెక్టు (ఏఐయూడీపీ) టీటీఎల్ గెరాల్డ్ పాల్ ఒలివర్, ఎడ్యుకేషన్ స్పెషలిస్ట్ సౌమ్య బజాజ్‌లతో కూడిన ఉన్నతస్థాయి బృందం రాజధాని ప్రాంతంలో విస్తృతంగా పర్యటించింది. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సామాజిక అభివృద్ధి కార్యక్రమాలపై ఈ బృందం ప్రధానంగా దృష్టి సారించింది.పర్యటనలో భాగంగా ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు తొలుత ఏపీసీఆర్‌డీఏ ప్రాజెక్టు కార్యాలయాన్ని సందర్శించారు. ఏఐయూడీపీ కింద రాజధానిలో చేపడుతున్న వివిధ పనుల తాజా పరిస్థితిపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రతినిధుల బృందం నేరుగా క్షేత్రస్థాయికి వెళ్లి అమరావతిలో అత్యంత కీలకమైన ట్రంక్ రోడ్ల నిర్మాణాలు, గ్రావిటీ కెనాల్ అభివృద్ధితో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనులను స్వయంగా పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పనుల పురోగతిని, నాణ్యతా ప్రమాణాలను సీఆర్‌డీఏ అధికారులు ప్రపంచ బ్యాంకు బృందానికి కూలంకషంగా వివరించారు.నిర్మాణ పనుల పరిశీలన అనంతరం ప్రపంచ బ్యాంకు బృందం ఎస్ఆర్ఎం యూనివర్సిటీని సందర్శించింది. ఏపీసీఆర్‌డీఏ సోషల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక యువతకు ఆ విశ్వవిద్యాలయంలో ఉచితంగా అందిస్తున్న స్వయం ఉపాధి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను వారు నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొంటున్న అభ్యర్థులతో ప్రతినిధులు ముఖాముఖిగా మాట్లాడారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో భవిష్యత్తులో లభించబోయే ఉపాధి అవకాశాలు, వారి కెరీర్ ప్రణాళికలపై విద్యార్థులతో పరస్పరం చర్చలు నిర్వహించారు.

# ఎప్‌స్టీన్ ఫైల్స్: అవును.. బిల్‌గేట్స్ సంచలన వాంగ్మూలం!

**ఎప్‌స్టీన్ కుంభకోణంలో.. మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, అపర కుబేరుడు బిల్ గేట్స్ పేరు మరోసారి తెరపైకి వచ్చింది. ఈ వ్యవహారంలో అమెరికా కాంగ్రెస్ కమిటీ ఎదుట ఆయన ఇచ్చిన 'రహస్య' వాంగ్మూలం ఇప్పుడు బయటకు రావడం సంచలనంగా మారింది. అందులో.. తనకు ముగ్గురు మహిళలతో సంబంధాలు ఉన్నాయని అంగీకరించిన గేట్స్.. జెఫ్రీ ఎప్‌స్టీన్ తనను బ్లాక్‌మెయిల్ చేసేందుకు ప్రయత్నించి ఉండొచ్చని ఆరోపించారు!.**




అమెరికా ప్రతినిధుల సభ పర్యవేక్షణ కమిటీ (హౌస్ ఓవర్‌సైట్ కమిటీ) ఎప్‌స్టీన్ నెట్‌వర్క్, అతడి పరిచయాలపై దర్యాప్తు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో జూన్ 10న బిల్ గేట్స్ స్వచ్ఛందంగా కమిటీ ఎదుట హాజరై వాంగ్మూలం ఇచ్చారు. తాజాగా విడుదలైన ట్రాన్స్‌క్రిప్ట్‌తో అనేక కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. గేట్స్ ఏం చెప్పినట్లు ఉందంటే.. రష్యాకు చెందిన బ్రిడ్జ్ క్రీడాకారిణి మిలా ఆంటోనోవా, అణు భౌతిక శాస్త్రవేత్త కరీమా నిగ్మతులినా, వైద్య రంగ పారిశ్రామికవేత్త అలిస్ జాకబ్స్ నెసెల్‌రోట్‌లతో తనకు సంబంధాలు ఉన్నాయని అంగీకరించారు. అయితే ఈ వ్యక్తిగత వ్యవహారాలకు ఎప్‌స్టీన్‌తో ఉన్న పరిచయానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. "ఆ సంబంధాలు నా కుటుంబానికి బాధ కలిగించాయి. కానీ ఎప్‌స్టీన్ వాటికి సంబంధించిన సమాచారంతో పాటు మరికొన్ని అబద్ధాలను కలిపి నాపై ఒత్తిడి తీసుకురావాలని చూశాడు" అని గేట్స్ పేర్కొన్నారు.

### బ్లాక్‌మెయిల్‌కు ప్రయత్నించాడా?

కమిటీ సభ్యుల ప్రశ్నలకు సమాధానమిస్తూ గేట్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎప్‌స్టీన్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన సమాచారాన్ని ఉపయోగించి తనపై ప్రభావం చూపాలని భావించి ఉండొచ్చని చెప్పారు. "అతడు నన్ను ఎప్పుడూ బ్లాక్‌మెయిల్ చేయలేదు. కానీ బయటకు వచ్చిన కొన్ని ఈమెయిల్స్‌ను చూస్తే, అలా చేయాలనే ఆలోచన అతడికి ఉండి ఉండొచ్చనే అనుమానం కలుగుతోంది" అని వ్యాఖ్యానించారు. 2014లో ఎప్‌స్టీన్‌తో సంబంధాలు తెంచుకున్న తర్వాత, తాను సంబంధం పెట్టుకున్న ఓ మహిళకు ఖర్చు చేసిన డబ్బును తిరిగి చెల్లించాలని కోరుతూ ఎప్‌స్టీన్ ఈమెయిల్ పంపినట్లు కూడా గేట్స్ వెల్లడించారు. అయితే తాము ఒక్క పైసా కూడా చెల్లించబోమని తన బృందానికి స్పష్టంగా చెప్పినట్లు తెలిపారు.

### బాధితుల సమక్షంలో ఉన్నానేమో...

వాంగ్మూలంలో అత్యంత కీలకంగా మారిన అంశం ఇదే. ఎప్‌స్టీన్ బాధితుల్లో కొందరు అతడి ఉద్యోగులుగానూ పనిచేసినట్లు దర్యాప్తులో తేలిందని కమిటీ సభ్యులు ప్రస్తావించారు. దీనిపై స్పందించిన గేట్స్.. ఎప్‌స్టీన్ విమానంలో జరిగిన ఒక సమావేశం ముగిసిన తర్వాత కొందరు మహిళా ఉద్యోగులను చూసినట్లు గుర్తు చేసుకున్నారు. "అది మంచి పాయింట్. నేను ఎప్‌స్టీన్ బాధితుల సమక్షంలో ఉండి ఉండొచ్చు" అని అంగీకరించారు. అయితే తాను ఎప్పుడూ ఎలాంటి లైంగిక వేధింపులను ప్రత్యక్షంగా చూడలేదని, అలాంటి ఘటనల్లో పాల్గొనలేదని స్పష్టం చేశారు.

### ఎస్‌టీడీ ఆరోపణలపై స్పందన

ఎప్‌స్టీన్‌కు సంబంధించిన పత్రాల్లో బిల్ గేట్స్‌కు లైంగిక సంబంధాల ద్వారా వ్యాపించే వ్యాధి (ఎస్‌టీడీ) సోకిందనే అనుమానం వ్యక్తమైందని, దానికి సంబంధించిన మందులు రహస్యంగా అందించారనే ఆరోపణలు కూడా ఉన్నాయని కమిటీ సభ్యులు ప్రశ్నించారు. దీనిపై స్పందించిన గేట్స్.. "నాకు ఎప్పుడూ ఎలాంటి ఎస్‌టీడీ రాలేదు. అలాంటి వ్యాధి సోకిందేమోనని ఆందోళన కలిగి ఉండొచ్చు. కానీ నాకు ఎప్పుడూ అలాంటి వ్యాధి లేదు. రహస్యంగా మందులు కూడా తీసుకోలేదు" అని స్పష్టం చేశారు.

### ఎప్‌స్టీన్‌తో సంబంధాలు ఎలాగంటే..

2011లో తనకు అత్యంత విశ్వసనీయ సహచరుడైన డాక్టర్ బోరిస్ నికోలిక్ ద్వారా ఎప్‌స్టీన్‌తో పరిచయం ఏర్పడిందని గేట్స్ తెలిపారు. అప్పటికే ఎప్‌స్టీన్‌కు లైంగిక నేరాలకు సంబంధించిన శిక్ష పడిన విషయం తనకు తెలుసని అంగీకరించారు. అయినప్పటికీ, ప్రపంచ ఆరోగ్య కార్యక్రమాల కోసం బిలియన్ల డాలర్ల నిధులు సమీకరించగలనని ఎప్‌స్టీన్ చెప్పడంతో అతడితో వృత్తిపరమైన సంబంధాలు కొనసాగించినట్లు వివరించారు. నాలుగేళ్ల వ్యవధిలో 12 నుంచి 14 సార్లు ప్రత్యక్షంగా, రెండు సార్లు వీడియో కాల్స్‌లో మాట్లాడినట్లు చెప్పారు. అయితే ఎప్‌స్టీన్ చెప్పిన వాగ్దానాలు ఏవీ నెరవేరలేదని, అతడితో పరిచయం కొనసాగించడం జీవితంలో చేసిన తప్పిదాల్లో ఒకటిగా భావిస్తున్నానని గేట్స్ పేర్కొన్నారు.

### ఎప్‌స్టీన్ ఫైల్స్ లో ఏముంది?

అమెరికా న్యాయ శాఖ ఇటీవల విడుదల చేసిన అదనపు పత్రాలు, ఈమెయిల్స్, ఫొటోలు ఈ వ్యవహారాన్ని మరోసారి వార్తల్లోకి తెచ్చాయి. ఆ పత్రాల్లో బిల్ గేట్స్‌తో పాటు పలువురు ప్రముఖుల పేర్లు, ఎప్‌స్టీన్‌తో జరిగిన సంప్రదింపులకు సంబంధించిన వివరాలు ఉన్నాయి. గేట్స్‌తో కలిసి ఉన్న కొన్ని ఫొటోలు కూడా బయటకు వచ్చాయి. అయితే అందులోని మహిళల పేర్లను గోప్యంగా ఉంచారు. ఇక ఈ ఏడాది జనవరిలో విడుదలైన ఈమెయిల్స్‌లో ఎప్‌స్టీన్, గేట్స్ ఫౌండేషన్‌కు చెందిన కొంతమంది సిబ్బంది మధ్య సంభాషణలు కూడా వెలుగుచూశాయి. దీంతో గేట్స్ ఫౌండేషన్ గతంలో ఎప్‌స్టీన్‌తో ఉన్న సంబంధాలపై ప్రత్యేక బాహ్య సమీక్ష ప్రారంభించినట్లు ప్రకటించింది. అదే సమయంలో కమిటీ మరో ట్రాన్స్‌క్రిప్ట్‌ను కూడా విడుదల చేసింది. అందులో ఎప్‌స్టీన్ దీర్ఘకాల సహాయకురాలు లెస్లీ గ్రాఫ్.. తన మాజీ యజమానిని "మాస్టర్ మానిప్యులేటర్"గా అభివర్ణించింది. అయితే అతడి నేరాల గురించి తనకు తెలియదని చెప్పింది. ఎప్‌స్టీన్, అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణలకు తానే అనేకసార్లు మధ్యవర్తిగా వ్యవహరించినట్లు కూడా ఆమె వెల్లడించింది.

### ఎందుకు ప్రాధాన్యం..?

ప్రముఖ ఫైనాన్షియర్ అయిన ఎప్‌స్టీన్ లైంగిక ఆరోపణల నేపథ్యంలో అరెస్ట్ అయ్యారు. అయితే 2019లో ఎప్‌స్టీన్ జైలులో మృతిచెందినా.. అతడి పరిచయ వలయం, ప్రపంచవ్యాప్తంగా ప్రభావవంతమైన వ్యక్తులతో ఉన్న సంబంధాలపై ప్రశ్నలు మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. తాజా వాంగ్మూలంతో బిల్ గేట్స్ వ్యక్తిగత జీవితం, ఎప్‌స్టీన్‌తో అతడి పరిచయాలు, బ్లాక్‌మెయిల్ ఆరోపణలు, బాధితుల సమక్షంలో ఉండి ఉండొచ్చన్న అంగీకారం మరోసారి అంతర్జాతీయ స్థాయిలో చర్చకు దారితీశాయి. ప్రపంచ ప్రముఖులపై ఎప్‌స్టీన్ వద్ద ఎంత సమాచారం ఉండేది, ఆ సమాచారం ద్వారా అతడు ఎంత ప్రభావం చూపగలిగాడన్న ప్రశ్నలకు ఈ కేసు కొత్త కోణాన్ని జోడించింది.

# ఖమేనీ అంత్యక్రియలకు ప్రధాని మోదీకి ఆహ్వానం



**ఢిల్లీ:** వచ్చే నెల(జులై)లో జరగనున్న అయాతొల్లా ఖమేనీ అంత్యక్రియలకు ప్రధాని నరేంద్ర మోదీని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ఆహ్వానించింది. ఇవాళ (మంగళవారం) న్యూఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం ఈ అధికారిక ఆహ్వానాన్ని విదేశాంగ మంత్రిత్వ శాఖకు (MEA) పంపింది. ఫిబ్రవరి 28న అమెరికాఇజ్రాయెల్ దాడుల్లో 86 ఏళ్ల ఇరాన్ సుప్రీం లీడర్ అయాతొల్లా ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. వచ్చే నెలలో మషాద్‌లో ఖమేనీ అంత్యక్రియలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి రావాలని మోదీని ఇరాన్ అధ్యక్షుడు ఆహ్వానించారు. జులై 9న ఖమేనీ అంత్యక్రియలు జరగనున్నాయి. 4వ తేదీ నుంచి కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. అంత్యక్రియల కార్యక్రమాలు జూలై 4న టెహ్రాన్‌లో ప్రారంభమై.. జూలై 9న ఖమేనీ స్వగ్రామమైన మషాద్‌లో ఆయన ఖననంతో ముగుస్తాయి. అధ్యక్షుడు పెజెష్కియాన్ తరపున అధికారిక ఆహ్వానాలు అందుకున్న ప్రపంచ నాయకులలో పీఎం మోదీతో పాటు చైనా, రష్యా, ఖతార్, ఫ్రాన్స్ , పాకిస్తాన్ దేశాల నేతలు ఉన్నారు. పాకిస్తాన్ ప్రతినిధి బృందం ఖమేనీ అంత్యక్రియలకు హాజరవుతుందని పాక్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ శుక్రవారం ప్రకటించారు. ప్రధాని మోదీ చివరిసారిగా మే 2016లో ఇరాన్‌లో అధికారిక ద్వైపాక్షిక పర్యటన చేశారు. ఆ సమయంలో చాబహార్ రేవు అభివృద్ధికి త్రైపాక్షిక ఒప్పందంపై సంతకం చేయడానికి ఆయన ఖమేనీ, అప్పటి అధ్యక్షుడు హసన్ రౌహానీలతో సమావేశమయ్యారు. రెండేళ్ల తర్వాత, ఫిబ్రవరి 2018లో పీఎం మోదీ ఆహ్వానం మేరకు అధ్యక్షుడు రౌహానీ భారత దేశంలో పర్యటించి.. న్యూఢిల్లీ, హైదరాబాద్‌లను సందర్శించారు. మోదీ, పెజెష్కియాన్ చివరిసారిగా అక్టోబర్ 2024లో రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ (BRICS) సదస్సు సందర్భంగా సమావేశమయ్యారు. ఆ సమయంలో పీఎం మోదీ, పెజెష్కియాన్‌ను భారత్‌ను సందర్శించాల్సిందిగా ఆహ్వానించారు. న్యూఢిల్లీలోని వర్గాల సమాచారం ప్రకారం.. ఈ అధికారిక అంత్యక్రియల కార్యక్రమానికి భారతదేశం తరపున ఎవరు ప్రాతినిధ్యం వహించాలనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. భారత్.. మార్చి 5న ఖమేనీ మృతికి అధికారికంగా సంతాపం తెలిపింది.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# ప్రపంచానికి 'కిమ్' సవాల్: అణ్వాయుధాలతో వీరంగం!



**ప్యాంగ్యాంగ్:** ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ మరోసారి ప్రపంచ దేశాలకు సవాల్ విసిరారు. తమ దేశ నౌకాదళాన్ని (నేవీ) అణ్వాయుధాలు కలిగిన శక్తివంతమైన బలగంగా మార్చబోతున్నట్లు ప్రకటించారు. పశ్చిమ రేవు పట్టణమైన నాంపోలో జరిగిన 'చోయ్ హ్యోన్' డిస్ట్రాయర్ (యుద్ధనౌక) ప్రారంభోత్సవ వేడుకలో కిమ్ ఈ సంచలన ప్రణాళికను వెల్లడించారు. అమెరికా, దక్షిణ కొరియాల నుంచి వస్తున్న సైనిక ఒత్తిళ్లను తిప్పికొట్టేందుకు ఈ వ్యూహం అత్యంత కీలకమని ఆయన అన్నారు.

### అణుశక్తిగా నౌకాదళం – కిమ్ జోంగ్ ఉన్ స్పష్టత

తమ నౌకాదళాన్ని అణ్వాయుధాలతో సన్నద్ధం చేసే కార్యక్రమం అనుకున్న సమయానికి, ఎటువంటి అడ్డంకులు లేకుండా సాగుతోందని కిమ్ జోంగ్ ఉన్ ప్రకటించారు. తమ దేశ భద్రతను కాపాడుకునేందుకు, అణ్వాయుధాలను ఎల్లప్పుడూ బహుముఖంగా ఉపయోగించడానికి ఈ వ్యూహాత్మక నిర్ణయం చాలా అవసరమని కిమ్ సమర్థించుకున్నారు. ఇప్పటికే ఉత్తర కొరియా అణు కార్యక్రమాలపై అంతర్జాతీయంగా అనేక ఆంక్షలు ఉన్నప్పటికీ, తమ రక్షణ కోసం వీటిని వీడే ప్రసక్తే లేదని కిమ్ స్పష్టం చేయడం గమనార్హం.

### రంగంలోకి 'చోయ్ హ్యోన్'

ప్రస్తుతం నౌకాదళంలో చేరిన 5,000 టన్నుల 'చోయ్ హ్యోన్' డిస్ట్రాయర్ తమ దేశ చరిత్రలోనే అత్యంత శక్తివంతమైన ఆయుధాలు కలిగిన నౌకగా ఉత్తర కొరియా మీడియా అభివర్ణించింది. అయితే ఇది కేవలం ఆరంభం మాత్రమేనని కిమ్ పేర్కొన్నారు. త్వరలోనే 'కాంగ్ కోన్' అనే మరో డిస్ట్రాయర్‌ను కూడా రంగంలోకి దించుతామని, ఆ తర్వాత వరుసగా 10,000 టన్నుల భారీ వ్యూహాత్మక యుద్ధనౌకల నిర్మాణాన్ని ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు.

### ఏటా రెండు మెగా నౌకలు

కిమ్ జోంగ్ ఉన్ ఆదేశాల ప్రకారం.. రాబోయే రోజుల్లో ఉత్తర కొరియా ప్రతి ఏటా 'చోయ్ హ్యోన్' కంటే పెద్దవైన రెండు ఉపరితల యుద్ధనౌకలను (10,000 టన్నుల క్రూయిజర్‌తో కలిపి) నిర్మించనుంది. అమెరికా, దక్షిణ కొరియాలు సంయుక్తంగా జరుపుతున్న సైనిక విన్యాసాల వల్ల కొరియా ద్వీపకల్పం దాదాపు 'అణు యుద్ధం అంచున' నిలిచిందని కిమ్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే తమ భద్రతాపరమైన రక్షణ చర్యల కోసమే నౌకాదళాన్ని ఇంత భారీ స్థాయిలో ఆధునీకరిస్తున్నట్లు ఉత్తర కొరియా అధికారిక వార్తా సంస్థ వెల్లడించింది.

# భారతీయులు ఖర్చు పెట్టరు.. వాన్స్ ప్రతిపాదనపై ట్రంప్ వ్యాఖ్య

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు చేసిన ప్రయత్నాలు మధ్యలో ఆగిపోయిన సంగతి తెలిసిందే. పుతిన్-జెలెన్‌స్కీల మొండిపట్టుతో ఆ చర్చలు ముందుకు సాగడం లేదు. అయితే.. ఈ వ్యవహారానికి సంబంధించి వైట్‌హౌజ్‌లో జరిగిన ఓ ఆసక్తికర చర్చ ఇప్పుడు బయటకు వచ్చింది. యుద్ధ విరమణ ఒప్పందాన్ని పర్యవేక్షించేందుకు నాటో దేశాల బలగాల బదులుగా భారత సైన్యాన్ని వినియోగించవచ్చనే ప్రతిపాదన వచ్చిందట. దానికి ట్రంప్ షాకింగ్ రియాక్షన్ ఇచ్చినట్లు ఇప్పుడు బయటకు వచ్చింది.**



జూన్ 23న విడుదలైన రిజిమ్ చేంజ్ పుస్తకాన్ని జర్నలిస్టులు మ్యాగీ హాబర్‌మన్, జోనాథన్ స్వాన్ రచించారు. ఇందులో 2025 జనవరి 30న ఓవల్ ఆఫీస్‌లో జరిగిన సమావేశం గురించి వివరించారు. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన కేవలం పది రోజుల తర్వాత ఈ సమావేశం జరిగినట్లు పేర్కొన్నారు. ఆ సమావేశంలో.. రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు ప్రత్యేక దూతగా నియమితులైన రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ కీత్ కెలాగ్ శాంతి ప్రణాళికను వివరించారు. ఆ ప్రణాళికలో యుద్ధ విరమణ అమలును పర్యవేక్షించేందుకు ఫ్రాన్స్, బ్రిటన్, నెదర్లాండ్స్ వంటి యూరోపియన్ దేశాల బలగాలను ఉక్రెయిన్‌లో మోహరించే ప్రతిపాదన చేశారు. అయితే నాటో సభ్య దేశాల సైన్యం ఉక్రెయిన్‌లో ఉంటే రష్యా దానిని రెచ్చగొట్టే చర్యగా పరిగణించే అవకాశం ఉందని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అభ్యంతరం వ్యక్తం చేశారట. అలా చేస్తే ఉద్రిక్తతలు మరింత పెరిగి యుద్ధం విస్తరించే ప్రమాదం ఉందని ఆయన భావించారట. దీంతో నాటోకు చెందని దేశాల బలగాలను ఉపయోగించవచ్చా? అని వాన్స్ ప్రశ్నించగా.. అప్పటి జాతీయ భద్రతా సలహాదారు మైకేల్ వాల్ట్జ్ కూడా ఆ ఆలోచనకు సానుకూలంగా స్పందించారు. అనంతరం భారత్, సౌదీ అరేబియా వంటి దేశాల బలగాలను పరిగణనలోకి తీసుకోవచ్చని వాన్స్ సూచించారట.

అయితే ట్రంప్ వెంటనే ఆ ప్రతిపాదనను తోసిపుచ్చినట్లు బిగ్గరగా నవ్వినట్లు.. రిజిమ్ చేంజ్ రచయితలు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని, మోదీ తనను ఇష్టపడతారని చెప్పినప్పటికీ, "భారతీయులు అలాంటి వాటికి ఖర్చు పెట్టరు. వారు దీనికి డబ్బులు వెచ్చించరు" అంటూ నవ్వుతూ వ్యాఖ్యానించినట్లు పుస్తకంలో వెల్లడించారు. అమెరికాకు ఆర్థిక బాధ్యతలు పెరగకూడదనే అంశంపైనే ట్రంప్ ప్రధానంగా దృష్టి పెట్టినట్లు పుస్తకం చెబుతోంది. బ్రిటన్ లేదంటే ఫ్రాన్స్ తమ సొంత నిర్ణయంతో బలగాలను పంపితే తనకు అభ్యంతరం లేదని, కానీ అమెరికా నేరుగా ఇందులో భాగస్వామి కాకూడదని ఆయన భావించినట్లు వివరించింది. అదే సమావేశంలో ట్రంప్ ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీపై కూడా తీవ్ర విమర్శలు చేసినట్లు పుస్తక రచయితలు పేర్కొన్నారు. జెలెన్‌స్కీని తట్టిపోయడమే కాకుండా.. ఉక్రెయిన్‌ను ప్రపంచంలోనే అత్యంత అవినీతిపరమైన దేశాల్లో ఒకటిగా వ్యాఖ్యానించినట్లు వెల్లడించారు.

అయితే ఇవన్నీ కొత్తగా విడుదలైన పుస్తకంలోని వాదనలు మాత్రమే. వైట్‌హౌస్ లేదంటే సంబంధిత వర్గాలు ఈ వివరాలపై అధికారికంగా స్పందించాల్సి ఉంది. అయినప్పటికీ, ఉక్రెయిన్ యుద్ధం, అమెరికా విదేశాంగ విధానం, భారత్‌తో ట్రంప్ సంబంధాలపై ఈ పుస్తకం కొత్త చర్చకు తెరలేపింది.

# వ్యాపారవేత్తతో 62 ఏళ్ల మోడల్ ఎంగేజ్‌మెంట్



రియాలిటీ టీవీ స్టార్, మాజీ మోడల్ యోలాండా హడిద్ ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్ రాండాల్ "రాండీ" కెండ్రిక్‌తో ఎంగేజ్‌మెంట్ చేసుకుంది. ఇద్దరు సూపర్ మోడల్స్, గిగి, బెల్లా హడిద్‌ల తల్లిగా పాపులర్ అయిన యోలాండా హడిద్, మరోసారి పెళ్లి పీటలు ఎక్కబోతున్నారు. 'రియల్ హౌస్‌వైవ్స్ ఆఫ్ బెవర్లీ హిల్స్' స్టార్ యోలాండా తన భాగస్వామి జోసెఫ్ జింగోలితో నిశ్చితార్థాన్ని రద్దు చేసుకున్న ఏడాది తరువాత వీరి నిశ్చితార్థం చేసుకున్నారు. యోలాండాకు తన మొదటి భర్త మహ్మద్ హడిద్‌తో ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరు ప్రముఖ సూపర్ మోడల్స్ గిగి హడిద్ (31), బెల్లా హడిద్ (29) , మోడల్ అన్వర్ హడిద్ (27).

### రాండీ కెండ్రిక్ ఎవరు?

లాస్ వెగాస్‌లో జన్మించిన రాండీ 1996లో స్థాపించిన 'Xebec' అనే జాతీయ లాజిస్టిక్స్ రియల్ ఎస్టేట్ సంస్థకు వ్యవస్థాపక సీఈఓ (CEO). అలాగే సాండొ లేక్స్ రాంచ్ వెంచర్, సాండొ లేక్స్ ఎనర్జీ కంపెనీలకు కూడా సీఈఓగా వ్యవహరిస్తున్నారు. అమెరికా వ్యాప్తంగా పారిశ్రామిక స్థలాలను అత్యాధునిక లాజిస్టిక్స్ హబ్‌లుగా మార్చడంలో ఈ సంస్థ ప్రసిద్ధి చెందింది. కోవిడ్19 మహమ్మారి సమయంలో కాలిఫోర్నియా, టెన్నెస్సీ, కెంటుకీ తదితర రాష్ట్రాలలో సౌండ్‌స్టేజీలు, క్రియేటర్ స్టూడియోలను నిర్మించడం ద్వారా వినోద రంగంలోకి కూడా అడుగుపెట్టారు. బయట పెద్ద బిజినెస్ టైకూన్ అయినప్పటికీ, రాండీ కుటుంబానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. వంట చేయడం, గిటార్ వాయించడం అంటే ఇష్టం. చిన్నప్పటి నుండి 'ఎల్విస్ ప్రెస్లీ'కి పెద్ద అభిమాని. వింటేజ్ గిటార్లను సేకరించే అలవాటు ఉంది. అంతేకాదు ఆయన వద్ద అరుదైన గిటార్ల కలెక్షన్ కూడా ఉంది. యోలాండా గతంలో జోసెఫ్ జింగోలి అనే వ్యక్తితో ఆరేళ్ల పాటు డేటింగ్ చేసి, జనవరి 2025లో విడిపోయారు. అయితే ఇప్పటికీ, వీరిద్దరూ మంచి స్నేహితులుగానే ఉంటున్నారు. అంతకుముందు యోలాండాకు రియల్ ఎస్టేట్ వ్యాపారి మహ్మద్ హడిద్ (19942000), మ్యూజిక్ ఎగ్జిక్యూటివ్ డేవిడ్ ఫోస్టర్ (20112017)లతో వివాహమైంది. యోలాండా, రాండీ కెండ్రిక్ జంట తమ వ్యక్తిగత జీవితాన్ని , బంధాన్ని చాలా ప్రైవేట్‌గా ఉంచడంతో వీరి ప్రేమాయణం చాలా రహస్యంగా సాగింది. అయితే కష్టమైన రోజులను దాటుకుని, వ్యక్తిగత ఎదుగుదలకు ప్రాధాన్యత ఇచ్చే యోలాండా.. 62 ఏళ్ల వయసులో రాండీ కెండ్రిక్ రూపంలో మళ్లీ తన జీవితంలో సంతోషాన్ని వెతుక్కున్నందుకు ఆమె అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


మహా పత్రిక





## నలుగురు డైరెక్టర్స్ మారారు..
# ఎట్టకేలకు ఫస్ట్ లుక్

గతేడాది 'కూలీ'గా వచ్చిన రజనీకాంత్ ప్రస్తుతం 'జైలర్ 2' చేస్తున్నారు. కమల్ హాసన్‌తో కలిసి ఓ మల్టీ స్టారర్ చేయాల్సి ఉంది. మరోవైపు కమల్ నిర్మాణంలో ఓ మూవీలోనూ నటిస్తున్నారు. తాజాగా ఆ చిత్ర ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. టైటిల్ కూడా రివీల్ చేశారు. ఇందులో డెడ్లీ డాక్టర్‌గా రజనీ కనిపించబోతున్నారు. తమిళంలో 'ఓ మై కడవులే', 'డ్రాగన్'.. తెలుగులో 'ఓరి దేవుడా' సినిమాలు తీసిన అశ్వత్ మారిముత్తు.. రజనీకాంత్ 173వ మూవీ 'ధర్మన్' తెరకెక్కిస్తున్నాడు. ఇదో థ్రిల్లర్ జానర్ స్టోరీ. రేపటి (జూన్ 25) నుంచి షూటింగ్ మొదలుపెట్టనున్నట్లు అశ్వత్ వెల్లడించారు. అనిరుధ్ సంగీతమందిస్తున్నాడు. మిగతా వివరాలు తెలియాల్సి ఉంది. బహుశా దీన్ని వచ్చే ఏడాది వేసవిలో రిలీజ్ చేయొచ్చు. ఇకపోతే ఈ మూవీ దర్శకుల మార్పు గురించి మాట్లాడిన రజనీకాంత్.. తొలుత కేఎస్ రవికుమార్ అనుకున్నాం. తర్వాత సుందర్.సి వచ్చాడు. కానీ అతడికి ఉన్న వేరే కమిట్మెంట్ వల్ల తప్పుకొన్నాడు. అనంతరం శిబి చక్రవర్తి ప్రాజెక్టులోకి వచ్చి వెళ్లాడు. ఇది చాలా సెన్సిటివ్ సబ్జెక్ట్. ఇందులో నేను న్యూక్లియర్ ఆయుధాలు తయారు చేసే సైంటిస్ట్‌గా కనిపిస్తాను. ఆఫ్ఘనిస్థాన్, రష్యాలో షూటింగ్ ప్లాన్ చేశాం. ఇది తీయడానికి చాలా సమయం పడుతుంది. అందుకే చివరకు అశ్వత్ మారిముత్తు ఈ ప్రాజెక్టులోకి వచ్చాడు అని చెప్పారు.

# చరణ్‌ను మోదీ అలా పిలవడం సంతోషంగా ఉంది

రామ్ చరణ్ హీరోగా వచ్చిన రూరల్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది. ఈనెల 4న విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ మూవీ ఏకంగా రూ.400 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. బుచ్చిబాబు డైరెక్షన్‌లో వచ్చిన ఈ సినిమాలో బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా మెప్పించింది. తాజాగా ఈ మూవీ సక్సెస్ మీట్ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా మెగాస్టార్ చిరంజీవి హాజరయ్యారు. ఈ సందర్భంగా తనయుడు రామ్ చరణ్ నటనపై ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా చరణ్ నటించలేదని.. జీవించాడని కొనయాడారు. అంతేకాదు అవార్డుల కంటే చరణ్ నటనపై ప్రశంసలే నాకు ఎక్కువ అని అన్నారు. ఈ సినిమాలో జాతీయ అవార్డ్ ఫర్మామెన్స్ ఇచ్చాడంటూ ఆకాశానికెత్తేశారు. తాజాగా ప్రధాని మోదీ చరణ్‌పై ప్రశంసించడంపై మెగాస్టార్ ట్వీట్ చేశారు. చరణ్‌ను న్యూ ఏజ్ మెగాస్టార్ అని సంభోధించడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రతిష్ఠాత్మక వేదికలపై చరణ్‌కు లభిస్తున్న గుర్తింపు, గౌరవం చూస్తుంటే ఒక తండ్రిగా గర్వంగా ఉందన్నారు. తన కృషి, అంకితభావం, నటనతో ప్రేక్షకుల అభిమానాన్ని మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా విశేషమైన గుర్తింపును కూడా సంపాదించుకోవడం నిజంగా సంతోషకరమన్నారు. రామ్ చరణ్ ఇంకా మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానంటూ పోస్ట్ చేశారు. 'పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జన్మించినపుడే పుట్టదు, జనులా పుత్రుని గనుగొని పొగడగా, పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ!" అంటూ సంతోషం వ్యక్తం చేశారు. కాగా.. రిపబ్లిక్ టీవీ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు రామ్ చరణ్ కూడా పాల్గొన్నారు.







## వెయింటిగ్ ఈజ్ ఓవర్..
# సర్దార్-2 వచ్చేస్తున్నాడు..!

కోలీవుడ్ హీరో కార్తీ నటించిన సీక్వెల్ మూవీ సర్దార్ 2. గతంలో వచ్చిన సర్దార్‌కు కొనసాగింపుంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ మూవీ షూటింగ్ గతేడాది జూన్‌లోనే పూర్తయి ఏడాది కావోస్తోన్న ఇప్పటికీ రిలీజ్‌కు నోచుకోలేదు. ఈ సినిమా రిలీజ్ డేట్ కోసం కార్తీ ఫ్యాన్స్ ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు వారి నిరీక్షణకు తెరపడింది. ఈ మూవీ విడుదల తేదని మేకర్స్ ఖరారు చేశారు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 10న దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు అఫీషియల్‌గా ప్రకటించారు. దీంతో కార్తీ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఇప్పటికైనా రిలీజ్ డేట్ ఫిక్స్ కావడంతో ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పార్ట్ 1 సూపర్ హిట్ కావడంతో సర్దార్ 2పై కూడా అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ మూవీ కార్తీకి జంటగా మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా కనిపించనున్నారు. ఈ సినిమాలో ఎస్‌జే సూర్య విలన్ పాత్రలో మెప్పించనున్నారు.



## కుర్రాళ్ళ లేటెస్ట్ క్రష్
# అందాల భామ రమ్య పసుపులేటి

రమ్య పసుపులేటి.. ఇప్పుడిప్పుడే టాలీవుడ్ లో నటిగా గుర్తింపు పొందుతుంది ఈ ముద్దుగుమ్మ . తన అందంతో అభినయంతో కట్టిపడేస్తుంది ఈ చిన్నది. ఆమె 2018లో విడుదలైన 'హుషారు' సినిమాతో హీరోయిన్ గా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఈ సినిమాలో తన క్యూట్ యాక్టింగ్‌తో కవ్వించింది. ఆతర్వాత వరుసగా సినిమాల్లో నటించి మెప్పించింది. కానీ ఈ అమ్మడు నటించిన సినిమాలేవీ బాక్సాఫీస్ దగ్గర పెద్దగా ఆడలేదు. మైల్స్ ఆఫ్ లవ్, ఫస్ట్ ర్యాంక్ రాజు', బీఎఫ్ఎఫ్ ('బెస్ట్ ఫ్లాట్‌మేట్ ఫరెవర్) అనే వెబ్‌సిరీస్‌లో నటించి మంచి గుర్తింపునందుకుంది. 2024లో వచ్చిన మారుతి నగర్ సుబ్రమణ్యం సినిమాతో ఈ అమ్మడు మంచి హిట్ అందుకుంది. ఈ సినిమాలో తన అందంతో ఆకట్టుకుంది. మ్యాన్ స్క్వేర్ సినిమాలో చిన్న పాత్రలో అలా మెరిసి ఇలా మాయం అయ్యింది. సోలో బాయ్ అంజి సినిమా చేసింది. ప్రస్తుతం చిరంజీవి విశ్వంభర సినిమాలో నటిస్తుంది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ చిన్నది క్రేజీ ఫోటోలు షేర్ చేస్తుంది.



## కంటెంట్‌తో కొట్టిన సామ్..
# డబుల్ బొనాంజా

సమంత ఒకప్పుడు తెలుగులో స్టార్ హీరోయిన్. కానీ పరిస్థితుల కారణంగా కొన్నాళ్ల పాటు సినిమాలకు దూరమైపోయింది. మరీ ముఖ్యంగా విడాకుల తర్వాత ఈమెపై విపరీతమైన నెగిటివిటీ వచ్చింది. ఈమెనే దీనికి కారణమన్నట్లు చాలామంది నెటిజన్లు విమర్శలు కూడా చేశారు. అలా టాలీవుడ్‌లోనే చాలానే విమర్శలు సమంత.. ఇప్పుడు అదిరిపోయే కమ్ బ్యాక్ ఇచ్చింది. ఇంతకీ ఇదెలా సాధ్యమైంది? సామ్‌కి ఎక్కడ కలిసొచ్చింది? చెన్నైకి చెందిన సమంత.. 'ఏ మాయ చేశావె'తో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. తొలి చిత్రంలో చేసి జెస్సీ పాత్రకు మంచి పేరు రావడంతో సామ్ పేరు హైలైట్ అయిపోయింది. ఈ దెబ్బకు ఎన్టీఆర్, మహేశ్ బాబు లాంటి స్టార్ హీరోల చిత్రాల్లో అవకాశాలు వచ్చాయి. అవి హిట్ కావడంతో ఈమె స్టార్ హీరోయిన్ అయిపోయింది. టాలీవుడ్‌కి చెందిన నాగచైతన్యని ప్రేమించి పెళ్లి చేసుకుంది. కానీ నాలుగేళ్లకే విడిపోవడంతో సమంతపైనే ఎక్కువగా విమర్శలు వచ్చాయి. విడాకుల తర్వాత సమంత సినిమాలు చేయడం కూడా తగ్గించేసింది. 2022లో వచ్చిన 'శాకుంతలం' అయితే సమంత కెరీర్‌లోనే పెద్ద డిజాస్టర్ అయింది. తీసింది దర్శకుడు గుణశేఖర్ అయినప్పటికీ ప్రమోషన్ల టైంలో తన వ్యాధి గురించి చెప్పడం, కన్నీళ్లు పెట్టుకోవడం లాంటి వీడియోల కారణంగా సమంతనే ఎక్కువ టార్గెట్ అయింది. తర్వాత ఏడాది చేసిన 'ఖుషి' మూవీ పర్లేదనిపించినప్పటికీ పెద్ద సక్సెస్ కాలేదు.



## ఆచితూచి అడుగులేస్తున్న మృణాల్..
# నెక్స్ట్ సినిమా ఎవరితో..?

బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్ క్రేజ్ గురించి చెప్పక్కర్లేదు. మరాఠీ బుల్లితెరపైకి నటిగా ఎంట్రీ ఇచ్చిన ఆమె.. ఆ తర్వాత నెమ్మదిగా కథానాయికగా మారింది. హిందీలో హీరోయిన్ ఆఫర్స్ అందుకుంటూ అద్భుతమైన నటనతో మెప్పించింది. మృణాల్ కు ఎక్కువగా క్రేజ్ వచ్చింది మాత్రం తెలుగు సినిమాతోనే.డైరెక్టర్ హను రాఘవపూడి తెరకెక్కించిన సీతారామం సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది ఈ ముద్దుగుమ్మ.మొదటి సినిమాతోనే నటిగా ప్రశంసలు అందుకుంది. ఇందులో సీతా మహాలక్ష్మీ పాత్రలో అందం, అభినయంతో కట్టిపడేసింది.దీంతో తెలుగులో వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ వంటి సినిమాలతో బ్యాక్ టూ బ్యాక్ హిట్స్ అందుకుంది.తెలుగుతోపాటు అటు హిందీలోనూ మరిన్ని ఆఫర్స్ అందుకుంది. అయితే ఫ్యామిలీ మ్యాన్ సినిమా తర్వాత మృణాల్ స్పీడ్ తగ్గించింది.ఇటీవలే డెకాయిట్ తో హిట్ కొత్తగా మృణాల్.. మళ్లీ చిన్న గ్యాప్ ఇచ్చింది. ఈ అమ్మడి నెక్స్ట్ సినిమా కోసం ఫ్యాన్స్ ఈగర్ గా ఎదురుచూస్తున్నారు.



# అబ్బబ్బా.. క్యూట్ స్మైల్ తో చంపేస్తోన్న మహా..

బుల్లితెరపై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి జ్యోతి పూర్వాజ్ తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. 'పొదరిల్లు' , 'మగువ ఓ మగువ' వంటి పాపులర్ ధారావాహికల ద్వారా తెలుగు ప్రేక్షకులలో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ అమ్మడు సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్.బుల్లితెరపై ఎంతో హోమ్‌లీగా, పద్ధతిగా కనిపించే ఈ నటి.. తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన కొన్ని గ్లామరస్ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.సాధారణంగా సీరియల్స్‌లో సాంప్రదాయబద్ధమైన పాత్రల్లో కనిపించే నటీమణులు.. రియల్ లైఫ్‌లో మోడరన్ అవుట్‌ఫిట్స్‌లో కనిపిస్తే ఆడియన్స్ ఎంతో ఆసక్తి చూపిస్తుంటారు.కృతిక విషయంలోనూ అదే జరిగింది. ఆమె తన లేటెస్ట్ ఫోటోషూట్‌లో ట్రెండీ , స్టైలిష్ గ్రీన్ కలర్ లాంగ్ ఫ్రాక్ డిజైన్ దుస్తులలో మెరిసిపోయింది. ప్రస్తుతం ఈ ఫోటోస్ వైరలవుతున్నాయి.స్లీవ్‌లెస్ టాప్, దానికి మ్యాచింగ్ చున్నీతో ఉన్న ఈ ఇండోవెస్ట్రన్ అవుట్‌ఫిట్‌లో ఆమె ఎంతో అందంగా, క్యూట్‌గా కనిపిస్తూ కుర్రకారు మనసు దోచుకుంటోందని కామెంట్స్ చేస్తున్నారు.ఇక ఈ ఫోటోలలో కృతిక ఇచ్చిన క్యూట్ స్మైల్, స్టన్నింగ్ పోజులు నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఫోటోలు చూసిన ఆమె అభిమానులు తెగ మురిసిపోతున్నారు.బుల్లితెర మహాలక్ష్మి.. మోడరన్ లుక్‌లోనూ అదిరిపోయింది, చాలా క్యూట్‌గా ఉన్నావు మహా అంటూ లైకులు, కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. మహాలక్ష్మి లేటేస్ట్ లుక్స్ వైరలవుతున్నాయి.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com